**2026లో 12 కోట్ల మంది ప్రయాణిస్తారు**

త్వరలో కార్యకలాపాలు ప్రారంభిం చనున్న నవీ ముంబయి విమానాశ్ర యం సహా తమ ఎనిమిది విమానా శ్రయాల్లో వచ్చే ఏడాది 12 కోట్ల మంది ప్రయాణిస్తారని అదానీ ఎయిర్‌పోర్ట్స్ అంచనా వేస్తోంది. నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ డిసెంబరు 25న ప్రారంభం కానున్న నేపథ్యంలో అదానీ ఎయిర్‌పోర్ట్ హెూల్డింగ్స్ (ఏఏహెచ్ఎల్) డైరెక్టర్ జీత్ అదానీ పీటీఐతో మాట్లాడారు.

# ధర్మఘంటి

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

**2030 నాటికి 50 లక్షల మందికి శిక్షణ**

నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అవసరమైన నైపుణ్యం కల మానవ వనరులను తయారు చేయటం కోసం అమెరికా టెక్ కంపెనీ ఐబీఎం భారీ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు అమలు చేయనుంది. 2030 నాటికి ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో 50 లక్షల మందికి శిక్షణ ఇవ్వనుంది. 'ఐబీఎం స్కిల్స్‌బిల్డ్' కింద ఈ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. దీనివల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, అదే సమయంలో వివిధ

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 266 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | మంగళవారం 23 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


సోనియా, రాహుల్ గాంధీలకు

## ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- నేషనల్ హెరాల్డ్ కేసులో హైకోర్టు నోటీసులు
- ఈడీ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు నిరాకరణ
- ట్రయల్ కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన ఈడీ



కర్ణాటకలో సీఎం మార్పును


## డిసైడ్ చేసేది ఆయనే


- కర్ణాటక నాయకత్వ మార్పుపై రాహుల్ గాంధీదే తుది నిర్ణయమని చెప్పిన సిద్ధరామయ్య
- అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ
- సీఎం మార్పుపై పదేపదే ప్రశ్నిస్తున్న మీడియాపై అసహనం వ్యక్తం చేసిన సీఎం
- డీకే శివకుమార్‌తో రాజన్న భేటీని సమర్థించిన ముఖ్యమంత్రి



## 'శాంతి' బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర

- దేశ అణు రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించే 'శాంతి' బిల్లు
- దీంతో అణు పురోగతికి ఆటంకంగా ఉన్నాయంటూ కేంద్రం భావిస్తోన్న పాత అణు చట్టాలు రెండూ రద్దయ్యాయి.
- ప్రైవేట్ కంపెనీలు సహా జాయింట్ వెంచర్లు ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నూతన అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించవచ్చు.





## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

- సుక్మా జిల్లాలో ఆయుధ కర్మాగారం ధ్వంసం
- అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కుట్ర భగ్నం
- సుక్మా జిల్లా మీనాగట్టా అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలతోపాటు పోలీసులు కూంబింగ్
- ఆయుధాలను, సింగిల్ షాట్ రైఫిల్స్‌ను, డిటోనేటర్లను, భారీ పేలుడు పదార్థాలను పెద్ద ఎత్తున స్వాధీనం

## శబరిమలలో ఫుడ్ సేఫ్టీ డ్రైవ్



త్వరలో తెలంగాణలోనూ

# ఎస్ఐఆర్



- 930 మంది ఓటర్లకు ఒక బీఎల్‌వో
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ త్వరలో తెలంగాణలోనూ ఎస్ఐఆర్
- ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో అమలు
- వలస ఓటర్లు ఏదైనా ఒక ప్రాంతంలో ఓటింగ్‌ను కలిగి ఉండాలి
- ఓటరు నమోదులో ఆధార్ కార్డు ఒక ఆప్షన్ మాత్రమేనన్న సీఈసీ




హైదరాబాద్

త్వరలో తెలంగాణలోనూ ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఎస్ఐఆర్ జరగని అన్ని రాష్ట్రాల్లోనూ మూడో దశలో సర్వే ఉంటుందని ఆయన వెల్లడించారు. బిహార్‌లో ఎస్ఐఆర్ విజయవంతమైందని, ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో కొనసాగుతోందని చెప్పారు. బిహార్‌లో జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రామాణికంగా తీసుకుని, తెలంగాణలోనూ బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) సర్వేను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎలాంటి ఫిర్యాదులు లేకుండా : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం బీఎల్‌వోలతో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా "దేశ ఎన్నికల వ్యవస్థకు బీఎల్‌వోలే వెన్నెముక. మన దేశ ఎన్నికల వ్యవస్థ నిర్వహణను ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తోంది. బిహార్‌లో ఎస్ఐఆర్ సర్వేను బీఎల్‌వోలు విజయవంతం చేసి, దేశానికి మార్గనిర్దేశం చేశారు. అక్కడ ఎస్ఐఆర్ నిర్వహించిన తర్వాత 7.5 కోట్ల - మిగతా3లో

శాస్త్రీయంగానే సాగిన

## డివిజన్ల పునర్విభజన




- అందరికీ సమానంగా 4 సేవలు
- జీహెచ్ఎంసీలో విలీనమైన 27 స్థానిక పట్టణ సంస్థలు
- శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కలుపుకొని బృహత్ నగరంగా ఏర్పాటు
- పునర్విభజన శాస్త్రీయంగా జరిగిందని చెబుతున్న అధికారులు
- అందరికీ సమానంగానే సేవలు

## హోంగార్డ్ సెలక్షన్స్‌కు 8,000 మందికిపైగా హాజరు.. ఏకంగా రన్‌వేపై పరీక్ష


## కేటీఆర్‌తో ఫుట్‌బాల్ ఎలా ఆడాలో సీఎం రేవంత్‌కు తెలుసు



- ప్రజలు ఎప్పుడో బీఆర్ఎస్‌ను ఫుట్‌బాల్ ఆడుకున్నారు
- అధికారం పోయిందని అక్కసుతో హరీష్ రావు మాట్లాడుతున్నారు
- హరీష్ రావుకు మించి తప్పుడు కూతలు, తప్పుడు మాటలు, గ్లోబల్ ప్రచారం ఎవరు చేయరు

## బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న హింస

- మరో విద్యార్థి నేతపై కాల్పులు
- ఎన్‌సీపీ నేత మహమ్మద్ షిక్దర్ తలపై కాల్పులు
- ఉస్మాన్ హాదీ హత్య తర్వాత పెరిగిపోయిన హింసాత్మక ఘటనలు
- ఫిబ్రవరి 2026 ఎన్నికల ముందు దేశంలో పెరుగుతున్న ఉద్రిక్తత





హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది...

## ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము

- ముగిసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది
- హైదరాబాద్ పర్యటన ముగించుకుని సోమవారం ఢిల్లీకి తిరుగుపయనం
- హకీంపేట ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికిన గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి
- పర్యటనలో భాగంగా పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్రపతి

## కేసీఆర్ చెప్పేవన్నీ అసత్యాలే

- కేసీఆర్ బరితెగించి మాట్లాడుతున్నారు.. ఉత్తమ్ స్ట్రాంగ్ వార్నింగ్
- తమ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోం
- కేసీఆర్ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు పెండింగ్ బిల్లులు పెట్టింది
- పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకుండా మహబూబ్‌నగర్ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసింది
- తెలంగాణ ప్రజల తలను తాకట్టు పెట్టి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిపోయింది
- రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్.

పెద్దపల్లి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ చెప్పేవన్నీ అసత్యాలేనని విమర్శించారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టారని.. అయిన 90 శాతం పనులు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు పెండింగ్ బిల్లులు పెట్టిందని ఆరోపించారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ రాలేదని చెప్పుకొచ్చారు. - మిగతా3లో



## సంపాదకీయం

# సంస్కరణల ముసుగులో పెత్తనం

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడమే కాక, మందబలంతో ఏకఛ్చత్రాధిపత్యం వహించింది. విపక్షాలు లేవదీసిన అభ్యంతరాలకు సరైన సమాధానాలు చెప్పడం లేదు సరికదా, చర్చకు కూడా అవకాశం లేకుండా బుల్‌డోజర్ సంస్కృతి అవలంబించింది. ఉన్నత విద్యారంగాన్ని తన గుప్పెటలో పెట్టుకోవడానికి శ్రీకారం చుట్టింది. ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో ఇతర దేశాలపై ఆధారపడే దుస్థితినుంచి బయటపడాలంటూ పదేపదే ప్రబోధించే మోడీ ప్రభుత్వం బీమా, అణువిద్యుత్ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు స్వాగతం పలకడం, ముఖ్యమైన వ్యవస్థలను విదేశాలకు తాకట్టుపెట్టడం ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేకత. ఇది కాక యుపిఎ ప్రభుత్వ చిహ్నాలను, మహాత్మాగాంధీ పేరును పూర్తిగా చెరిపేసేందుకు చరిత్రాత్మక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది. ఈ పథకాన్ని తన అధీనం లోకే తెచ్చుకుని తన పెత్తనంతోనే పనులు సాగేలా మార్చుకుంది. ఈ పథకంలో 100 రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచి ఉద్ధరిస్తున్నట్టు నమ్మిస్తున్నా దాని అసలు స్వరూపం వేరేగా ఉంటోంది. ఏ రాష్ట్రంలో, ఎక్కడ, ఏ పనులు చేపట్టాలో కేంద్రమే నిర్ణయిస్తుంది. ఏ రాష్ట్రానికి ఎంత బడ్జెట్ కేటాయిస్తుందో ఆ మేరకే పనులు చేపట్టాలి. అదీ కూడా అవసరం బట్టే పని కల్పన ఉంటుంది. అంటే రాష్ట్రాలకు ఇందులో ఎలాంటి స్వేచ్ఛ లేనట్టే. ఇక నిధుల వ్యయంలో ఇంతవరకు శ్రామికుల వేతనాలు పూర్తిగా, సామగ్రి వ్యయంలో 75% నైపుణ్యం, పాక్షిక నైపుణ్య కార్మికుల వేతనాల్లో 75 శాతం కేంద్రమే చెల్లించేది. కానీ ఇకనుంచి మొత్తం వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వమే 40 శాతం వరకు భరించక తప్పదు. 90ః 10 గా ఉన్న వ్యయం ఇకనుంచి 60ః40 గా ఉంటుంది. ఇంత భారీ వ్యయాన్ని రాష్ట్రాలు ఎంతవరకు భరించగలవో ఆలోచించాలి. ఈ వివాదాస్పద నిర్ణయంపై కాంగ్రెస్‌తో సహా విపక్షాలన్నీ భగ్గుమంటున్నాయి. జాతీయ స్థాయిలో వ్యతిరేక ఉద్యమానికి సన్నద్ధమవుతున్నాయి. కేంద్రం మితిమీరిన పెత్తనానికి మరో తార్కాణం ఉన్నత విద్యారంగం. ఉన్నత విద్య క్రమబద్ధీకరణ చట్టాన్ని పూర్తిగా ఏకీకృతం చేస్తూ వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (వి బిఎస్ఎ) బిల్లును తీసుకొచ్చింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) పర్యవేక్షణ అధికారాలన్నీ ఒకే రెగ్యులేటర్ కిందకు తెస్తూ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేస్తోంది. అన్ని కేంద్ర యూనివర్శిటీలు, వాటి కిందగల కాలేజీలు, విద్యామంత్రిత్వశాఖ పరిపాలన కింద గల జాతీయ ప్రాముఖ్యత గల సంస్థలన్నీ ఈ కమిషన్ కిందకే వస్తాయి. ప్రస్తుతం యుజిసి కింద లేని ఐఐటిలు, ఐఐఎంలు, ఎన్‌ఐటిలు, ఐఐఎస్‌సిలు, ఐఐఎన్ఇఆర్‌లు, ట్రిపుల్ ఐటిలు కూడా ఈ కమిషన్ కిందకే వస్తాయి. ఈ విబిఎస్ఎ కమిషన్‌లో తనకు అనుకూలమైన తొమ్మిది మందిని కేంద్రమే నియమిస్తుంది. ఈ బిల్లుపై రాష్ట్రాలకు ఎలాంటి హక్కులు ఉండవు. రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు కూడా కేంద్ర అధిష్ఠానం ఆదేశాలకే లోబడాల్సి వస్తుంది. ఇక బీమా రంగంలో విదేశీ సంస్థలు పూర్తిస్థాయిలో ప్రవేశించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బీమా రంగంలో ప్రస్తుతం 74% వరకు ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం పెంచడానికి వీలుగా బిల్లును రూపొందించింది. జిడిపిలో 3 శాతం వాటాకు పరిమితమైన బీమారంగం ఇక నుంచి విదేశాల్లో మాదిరిగా ఆరున్నర శాతానికి చేరుతుందని ప్రభుత్వం నమ్మబలుకుతోంది. నూరు శాతం ఎఫ్‌డిఐలతో విదేశీ కంపెనీలు తక్కువ మూలధనంతో ఇకపై ఇక్కడ వ్యాపారాలు పెట్టుకోవచ్చు. ఇప్పటివరకు 65 శాతం వాటాతో అత్యంత బలంగా ఉన్న ప్రభుత్వ రంగ ఎల్ఐసికి ఇప్పుడు అగ్నిపరీక్షే ఎదురవుతుంది. బీమా రంగంలో వంద శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరిచిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అణుశక్తి బిల్లు రూపంలో మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. అణుశక్తిని స్థిరంగా వినియోగించుకుంటూ అభివృద్ధి పథం వైపు దేశాన్ని తీసుకెళ్లడమే లక్ష్యంగా 'శాంతి బిల్లు' ను ప్రవేశపెట్టినట్టు మోడీ ప్రభుత్వం ప్రకటిస్తోంది. అణు విద్యుత్ సంస్థాపిత సామర్థం ప్రస్తుత 8.8 గిగావాట్లు నుంచి 2047 నాటికి 100 గిగావాట్లకు పైగా పెంపు చేయడమే లక్ష్యంగా 2008లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అమెరికాతో సివిల్ అణుశక్తి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అయితే రియాక్టర్లలో ఏదైన ప్రమాదం సంభవిస్తే మానవ ప్రాణ, పర్యావరణ నష్టానికి ఆ రియాక్టర్ల సరఫరాదారు పరిహారం చెల్లించాలని సివిల్ లయబిలిటీ బిల్లు తీసుకు రాగా, అమెరికా కంపెనీలు వ్యతిరేకించడంతో బిల్లు అమలు కాలేదు. ఈ పరిహారం విషయంలో సడలింపు కల్పించి దాన్ని మోడీ ప్రభుత్వం అమలులోకి తీసుకు వస్తోంది. 1962 అణుశక్తి చట్టం, 2010 పౌర అణు నష్టపరిహార చట్టాన్ని రద్దు చేయాలనే బిల్లు లోని నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు రియాక్టర్ల సరఫరాదారుల నష్టపరిహార చెల్లింపు బాధ్యత కేవలం 300 మిలియన్ డాలర్లకే పరిమితం చేయడం ప్రజలభద్రతను నిర్లక్షం చేయడమే. జపాన్‌లో పుకుషిమా, రష్యాలో చెర్నోబిల్ అణుప్రమాదాలు నేర్పిన గుణపాఠాలు ఇప్పుడు విస్మరించడం ఎవరికీ క్షేమం కాదు. నియంత్రణలన్నీ ప్రభుత్వం చేతిలోనే ఉంటాయని చెబుతున్నప్పటికీ బహుళజాతి కంపెనీలు ఎంత శక్తిమంతమైనవో భోపాల్ యూనియన్ కార్బైడ్ గ్యాస్ లీక్ ప్రమాదం సంఘటనే ప్రత్యక్ష సాక్షం. ఈ బిల్లు ద్వారా అమెరికా, ఫ్రాన్స్ వంటి విదేశీ కంపెనీలకే తప్ప భారత కంపెనీలకు ప్రయోజనం శూన్యం అన్న విమర్శలు వస్తున్నాయి.

# సాహితీ సమాలోచనం .. సాంస్కృతిక మహోత్సవం

దివంగత కీ.శే. కనుసలి మాలతి 56వ జయంతి సందర్భంగా.. భీమ్ డ్రం భీమ్ డ్రమ్ సాహితీ, సాంస్కృతిక సంస్థ మరియు దలిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్( డీ.బీ.ఎస్.ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ డిసెంబర్ 2025 నాడు బుధవారం సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ లోని రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహిస్తున్నట్లు డిబిఎస్ఏ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ , ఉస్మానియా విశ్వవిద్యాలయం పి హెచ్ డి స్కాలర్ జంగిలి దర్శన్ తెలిపారు. దివంగత కీ.శే. కనుసలి మాలతి తేది. 22-11-2023 బుధవారం నాడు క్యాన్సర్ వ్యాధితో పరమపదించారు. చివరి శ్వాస వరకు వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం అన్నింటినీ సంపూర్ణంగా నడిపించిన మహనీయురాలు. కీ.శే. కనుసలి మాలతమ్మ యాదిలో ఆమె ప్రేమకు, ఆప్యాయతకు, సేవకు, త్యాగానికి, మహోన్నత మానవత్వానికి శతకోటి సుమాంజలులు సమర్పిస్తున్నామన్నారు. ఈ స్మరణీయ సభకు మీరు విచ్చేసి, మీ సాన్నిధ్యంతో కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేసి, ఈ మహనీయురాలి స్మృతికి అర్థవంతమైన నివాళిని అర్పించి, శ్రద్ధాంజలి ఘటించవలసిందిగా వినమ్రంగా కోరారు.

**ప్రేమే జీవితం - సేవే శ్వాస - త్యాగమే తత్వం**

**కీ.శే. కనుసలి మాలతి జీవన ప్రస్థానం :**

**ఒక అనన్యసాధారణ ఆదర్శ గాథ**

భీమ్ డ్రం భీమ్ డ్రమ్ సాహితీ, సాంస్కృతిక సంస్థ మరియు దలిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్( డీ.బీ.ఎస్.ఏ) ఆధ్వర్యంలో

కీ.శే. కనుసలి మాలతి 56వ జయంతి సందర్భంగా.. ప్రేమ, త్యాగం, మృదుత్వం, మానవత్వం, ప్రజాసేవ అనే విలువలను తన జీవితంగా మలచుకున్న పేదల పేగుబంధం కీ.శే. కనుసలి మాలతి జ్ఞాపకార్థం ... ఈ మహనీయురాలు చేసిన సేవలను, ఆమె జీవితాంతం చేసిన త్యాగాలను నెమరు వేసుకుంటూ, భవిష్యత్ తరాలకు ఆమెను స్ఫూర్తిగా నిలపాలనే సంకల్పంతో భీమ్ డ్రం మరియు దలిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ డిసెంబర్ 2025 నాడు బుధవారం సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ లోని రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాహితీ సమాలోచన, సాంస్కృతిక మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.
ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, రచయితలు, మేధావులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, సామాజిక ఉద్యమ నాయకులు, వాగ్గేయకారులు హాజరై తమ మాట, పాటలతో దివంగత మాలతి సేవలను స్మరిస్తూ కార్యక్రమాన్ని సుసంపన్నం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాం.

**వ్యక్తిత్వం -సుగుణం -సుభాషితం:**

కడుపు చూసి అన్నం పెట్టే మానవత్వానికి ప్రతిరూపం "మాలతమ్మ" ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిసిన వెంటనే ఆదుకునే ఆపన్న హస్తం "మాలతమ్మ". కరుణామయి, పేదలను, అనాధలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పిన మంచి మనసున్న మహనీయురాలు. ఎప్పుడు చిరునవ్వుతో పలకరించే ప్రసన్న వదనం, కాంతివంతగా, నిర్మలంగా ఆహ్లాదంగా సాక్షాత్కరించే తేజస్సు. తన కలుపుగోలుతనం, మంచితనం, మానవత్వం, ఎనలేని జాలి, దయ, కరుణలతో నిండిన మహోన్నత వ్యక్తిత్వం ఆమెది. బతికినంతవరకు నీతిగా, నిజాయితీగా జీవించడమే మహనీయుల ఆదర్శ జీవితం అని తన ఆచరణతో నిరూపించిన సద్గుణ సంపన్నురాలు. వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం అన్నింటినీ క్రమశిక్షణతో నడిపించిన ఆమె జీవన ప్రస్థానం పుట్టుక నుండి చివరి శ్వాస వరకు మహత్తరమైనది, ఆదర్శవంతమైనది.

**జననం బాల్యం కుటుంబ నేపథ్యం:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఆర్ అండ్ బీ విభాగంలో ఇంజనీర్ గా సేవలందించి, కార్యనిర్వాహక ఇంజనీర్ గా పదవీ విరమణ పొందిన కీ.శే. బొల్లూర్ శ్యామ్ రావు మరియు భారత సంచార నిగమ్ లిమిటెడ్ బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ విభాగంలో సేవలందించి, సీనియర్ ఉద్యోగినిగా పదవీ విరమణ పొందిన ఎ.పి. హేమావతి అను ఇరువురు పుణ్య దంపతులకు తేది. 24-12-1969 నాడు ప్రేమ్ నగర్ (ఖైరతాబాద్), హైదరాబాద్ లో దివంగత ప్రేమామహి కనుసలి మాలతి జన్మించారు. చదువులో ముందుండి, ఆటపాటల్లో చురుకుగా పాల్గొంటూ, నృత్యంలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. తోబుట్టువులుగా సుజాత (మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ) మరియు తమ్ముడు సుశీల్ బోస్ (డివిజనల్ ఇంజనీర్, విద్యుత్ సౌధా, హైదరాబాద్) ఉన్నారు. చిన్ననాటి నుంచే అమ్మానాన్నలపై అపారమైన ప్రేమ, గౌరవం చూపుతూ తన కుటుంబమే ప్రపంచంగా భావించిన సర్వసాధారణ వనిత మాలతమ్మ.

**విద్యాభ్యాస ప్రస్థానం:**

సెయింట్ ఆన్స్ హై స్కూల్, మాసబ్ ట్యాంక్ లో పాఠశాల విద్య, పుల్లారెడ్డి జూనియర్ కళాశాల, మెహదీపట్నంలో మధ్యంతర విద్య, వనిత మహావిద్యాలయం, ఎగ్జిబిషన్ గ్రౌండ్, నాంపల్లిలో డిగ్రీ విద్యను పూర్తిచేసి పట్టభద్రులైనారు.

**వివాహ జీవితం ఆదర్శ దాంపత్యం:**

డాక్టర్ కనుసలి అంజయ్యతో (వైద్య పట్టభద్రుడు ఎంబీబీఎస్, వైద్య పరిపాలనలో ఎండీ, వైద్య ఆరోగ్య శాఖ తెలంగాణ అదనపు సంచాలక ప్రత్యేక హోదా పదవీ విరమణ అక్టోబర్ 2017 నాడు ) తేదీ 17-02-1989 నాడు హైదరాబాద్ లో వివాహం ఘనంగా జరిగింది.

**సంతానం తల్లి పాత్రకు నిలువెత్తు నిదర్శనం:**

నలుగురు కుమారులను చెంపదెబ్బ కూడా కొట్టకుండా, అపారమైన ప్రేమ, ఆప్యాయత, అనురాగాలతో పెంచిన ఆదర్శ తల్లి మాలతమ్మ. రవికిరణ్ (బీటెక్, ఆదాయ పన్ను శాఖ అధికారి హైదరాబాద్), కీ.శే. శశికిరణ్ (బీటెక్), హరికిరణ్ (బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, ప్రపంచ మానవ హక్కుల మండలి తెలంగాణ డైరెక్టర్), డాక్టర్ సాయికిరణ్ (వైద్య పట్టభద్రుడు ఎంబీబీఎస్, పీజీ నీట్ లో ఉత్తమ ర్యాంక్ సాధించి ప్రసిద్ధమైన ఉస్మానియా వైద్య కళాశాల మరియు ప్రసిద్ధమైన ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చర్మ వ్యాధుల వైద్య శిక్షణ ఎండీ డెర్మటాలజీ కోర్సులో ప్రవేశం). పిల్లలందరినీ ఉన్నత చదువులు చదివించి సమాజంలో గౌరవప్రదమైన స్థానాలకు చేర్చిన ఘనత ముమ్మాటికీ మాలతమ్మదే.

**భర్తతో అనుబంధం సేవలో భాగస్వామ్యం:**

భర్త డాక్టర్ కనుసలి అంజయ్యతో సరి సమానంగా అన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఆయన పనిచేసిన ప్రతి ఆసుపత్రిలో రోగులకు, వారి బంధువులకు మానవత్వంతో సహాయం అందించారు. కాయకష్టం చేసేవారి పిల్లలను చేరదీసి చదువు చెప్పించి ఆర్థిక సహాయం అందించి, అనాథల మానసికోల్లాసానికి దారివేసింది. పుట్టింట్లో ఎలా ఉంటారో మెట్టింట్లో కూడా అలాగే .. అత్తమామలు, బంధువులతో అన్యోన్యంగా కలిసిపోయారు.

**సమాజమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు**

మహాత్మా జ్యోతిరావు పూలే సావిత్రీబాయి పూలే దంపతుల సేవా మార్గాన్ని అనుసరించి తన ఇంట్లో పనిచేసే వారి పిల్లలకు, డ్రైవర్ల పిల్లలకు, అనాథ ఆశ్రమాలలోని పిల్లలకు, పుస్తకాలు, బట్టలు కొనిచ్చి చదువులో ప్రోత్సహిస్తూ, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, వీధిబాలలను జీవితకాలం అక్కున చేర్చుకున్నారు. కుటుంబం సమాజం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇచ్చిన ఆదర్శ దంపతులు డాక్టర్ అంజయ్య మాలతి దంపతులు.

**డాక్టర్ కనుసలి అంజయ్య వైద్య సేవా ప్రస్థానం:**

ఉస్మానియా వైద్య కళాశాల మరియు ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో 1983 84లో వైద్య పట్టభద్రుడిగా విద్య పూర్తి చేసి, 1987 1990లో కుష్ఠు వ్యాధి నియంత్రణ విభాగం, నాగర్ కర్నూల్ లో ప్రభుత్వ వైద్యాధికారిగా,1990 1991లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలిలో ప్రాజెక్ట్ హెల్త్ ఆఫీసర్ గా సేవలందించారు. 1991 1993లో నిమ్స్ ఆసుపత్రిలో వైద్య పరిపాలకుడిగా పనిచేస్తూ అరుదైన వైద్య పరిపాలన ఎండీ పూర్తి చేశారు. 1993 1994లో ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో సహాయ నివాస వైద్యాధికారిగా, 1994 1998లో ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో సహాయ నివాస వైద్యాధికారిగా పనిచేశారు. 1998లో అత్యంత పిన్న వయసులో సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ గా ద్విపదోన్నతులు పొందారు. 1998 2005లో పాత, కొత్త గాంధీ ఆసుపత్రుల్లో, 2005 2012లో సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో, 2012 2017లో ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్, నివాస వైద్యాధికారి మరియు అదనపు సంచాలక ప్రత్యేక హోదాలో సేవలందించి అక్టోబర్ 2017లో పదవీ విరమణ పొందారు.

**అవార్డులు - రివార్డులు - కీర్తి, ప్రతిష్టలు:**


పేదలకు ఎనలేని వైద్య సేవలందించినందుకు 2004 ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఏప్రిల్ 05న బాబు జగ్జీవన్ రామ్ జయంతుల సందర్భంగా రవీంద్ర భారతి ప్రధాన సభా ప్రాంగణంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, షెడ్యూల్డ్ కులాల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక దళితరత్న అవార్డుతో సహా అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ప్రస్తుతం సెప్టెంబర్ 2018 నుండి కామినేని హాస్పిటల్స్ ఎల్ .బి నగర్ హైదరాబాద్ లో (మెడికల్ సూపరింటెండెంట్) గా కొనసాగుతున్నారు నేటికీ నిర్వీరమంగా అదే సేవాదృక్పథాన్ని, అంతటి స్ఫూర్తిని, మానవత్వాన్ని చాటుతున్నారు

**చివరి మజిలీ శాశ్వత స్మృతి:**

దివంగత కీ.శే. కనుసలి మాలతి తేది. 22-11-2023 బుధవారం నాడు క్యాన్సర్ వ్యాధితో పరమపదించారు. చివరి శ్వాస వరకు వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం అన్నింటినీ సంపూర్ణంగా నడిపించిన మహనీయురాలు. కీ.శే. కనుసలి మాలతమ్మ యాదిలో ఆమె ప్రేమకు, ఆప్యాయతకు, సేవకు, త్యాగానికి, మహోన్నత మానవత్వానికి శతకోటి సుమాంజలులు సమర్పిస్తున్నాం.
ఇంతటి ఘన చరిత్రను తన జీవితం ద్వారా లిఖించిన కీ.శే. కనుసలి మాలతి 56వ జయంతిని పురస్కరించుకొని, ఆమె చేసిన అపూర్వ త్యాగాలు, ప్రజాసేవ, మానవత్వం భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలనే సంకల్పంతో ఈ స్మారకోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోంది. జీవితం చివరి శ్వాస వరకు పేదల పక్షాన నిలిచి, సమాజంలో మార్పుకు బాటలు వేసిన ఈ మహనీయురాలి సేవలను విశాల సమాజానికి తెలియజేయడం ద్వారా, ప్రతి ఒక్కరిలోనూ మానవత్వం, బాధ్యత, సేవా దృక్పథం మరింత బలపడుతుందనే విశ్వాసంతో ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశాము. కావున ఈ స్మరణీయ సభకు మీరు విచ్చేసి, మీ సాన్నిధ్యంతో కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేసి, ఈ మహనీయురాలి స్మృతికి అర్థవంతమైన నివాళిని అర్పించి, శ్రద్ధాంజలి ఘటించవలసిందిగా వినమ్రంగా కోరుతున్నాం.




# 'శాంతి' బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర



అణు రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించే సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. 'శాంతి' బిల్లుకు ఇటీవల రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారని కేంద్రం తాజాగా ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ బిల్లు పౌర అణు రంగాన్ని నియంత్రించే ప్రస్తుత చట్టాలన్నింటినీ విలీనం చేయడం సహా ప్రైవేట్ భాగస్వామ్యానికి మార్గం సుగమం చేయనుంది. దీంతో దేశంలో అణు అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నాయని కేంద్రం భావిస్తోన్న 1962 నాటి అణుశక్తి చట్టం, 2010 నాటి అణు బాధ్యత సంబంధిత చట్టాలు రద్దయాయి. కొత్త చట్టం ప్రకారం.. ప్రైవేట్ కంపెనీలు సహా జాయింట్ వెంచర్లు ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నూతన అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించవచ్చు. అంతేకాకుండా వాటిని నిర్వహించుకునే వెసులుబాటు సహా సొంతం చేసుకునే లేదా తొలగించే అవకాశం కూడా ఉంటుంది. అయితే.. వ్యూహాత్మక, సున్నితమైన కార్యకలాపాలు మాత్రం రాష్ట్ర నియంత్రణలోనే ఉంటాయనే విషయాన్ని ఈ బిల్లు స్పష్టం చేస్తుంది. యురేనియం థోరియం వంటి తవ్వకాలు, ఐసోటోపిక్ విభజన పునరుత్పాదక ఇంధనాలు, అధిక స్థాయి రేడియోధార్మిక వ్యర్థాల నిర్వహణ, భారీ నీటి ఉత్పత్తిని కేంద్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వ యాజమాన్య సంస్థలు నిర్వహిస్తాయి. ఈ శాంతి బిల్లు అమలు దేశ పౌర అణు వ్యవస్థలో కీలక భూమిక పోషించనుంది. ప్రభుత్వం.. అణు ఇంధనానికి సంబంధించిన కీలక అంశాలను నియంత్రిస్తూనే విద్యుత్ ఉత్పత్తికి ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించేందుకు వీలుంటుంది. ఈ బిల్లు ద్వారా.. ప్రైవేట్ రంగాలు సహా యువతకు అనేక అవకాశాలు కల్పిస్తాయని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ(గావీ వీశీఁఱ) చెప్పిన విషయం తెలిసిందే. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, నవకల్పనల మార్గంలో ముందడుగు వేసేందుకు, నిర్మాణాలు చేపట్టేందుకూ అత్యంత అనుకూలమని కూడా అన్నారు మోదీ.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ



ఇప్పటికే ఆపరేషన్ కగార్‌తో కకావికలమైన మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని మావోయిస్టుల ఆయుధ కర్మాగారాన్ని భద్రతాబలగాలు, పోలీసులు సంయుక్తంగా ధ్వంసం చేశారు. దాంతో అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కుట్రను భగ్నంచేశారు. సుక్మా జిల్లా మీనాగట్టా అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలతోపాటు పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులు నిర్వహిస్తున్న ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతాబలగాలు గుర్తించాయి. అందులో భారీ ఎత్తున ఉన్న ఆయుధాలను, సింగిల్ షాట్ రైఫిల్స్‌ను, డిటోనేటర్లను, భారీ పేలుడు పదార్థాలను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. అలాగే భద్రతాదళాలే లక్ష్యంగా బాంబుల తయారీకి సంబంధించిన మెటీరియల్‌ను సైతం వారు పేల్చేశారు. 2026 మార్చి నెల ఆఖరులోపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందుకోసం మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో కేంద్ర భద్రతా బలగాలతోపాటు ఆ రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే వందల సంఖ్యలో మావోయిస్టులను భద్రతా బలగాలు అరెస్ట్ చేశాయి. ఇక జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాల ఎదుట పలువురు మావోయిస్టులు లొంగిపోయారు.

## హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది...

# ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము



హైదరాబాదులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది సోమవారంతో ముగిసింది. ఈ సాయంత్రం హైదరాబాద్ పర్యటనను ముగించుకుని ఆమె ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నత స్థాయి సివిల్, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రయాణం సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట ఎయిర్‌బేస్ వరకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. శీతాకాల విడిది కోసం డిసెంబర్ 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 19న రామోజీ ఫిల్మ్ సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ప్రారంభించారు. 20న బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 21న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోమ్' విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ సమయంలో రాష్ట్రపతి నిలయం నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. 1860లో నిర్మించిన ఈ భవనం, 1948లో హైదరాబాద్ భారత్‌లో విలీనమైన తర్వాత రాష్ట్రపతి విడిది కేంద్రంగా మారింది.

### హోంగార్డ్ సెలక్షన్స్‌కు 8,000 మందికిపైగా హాజరు..

### ఏకంగా రన్‌వేపై పరీక్ష

**భువనేశ్వర్:** హోంగార్డ్ సెలక్షన్స్‌కు 8,000 మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. దీంతో అంత మందికి పరీక్ష నిర్వహించడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఏకంగా రన్‌వేపై వారికి రాత పరీక్ష నిర్వహించారు. (గాంఱంఫ్ఘు వ×ఖుఎ ష్టవశ్రీస శీఱ ఖఱతీర్‌తీఱజూ) ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సుమారు 200లోపు ఉన్న హోంగార్డుల పోస్టుల భర్తీకి అభ్యర్థులు అసాధారణ సంఖ్యలో దరఖాస్తు చేశారు. నియామక పరీక్ష కోసం 8,000 మందికిపైగా హాజరయ్యారు. కాగా, ఇంత భారీ సంఖ్యలో అభ్యర్థులకు పరీక్ష నిర్వహించడం పోలీస్ అధికారులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 16న ఉదయం వేళ ఏకంగా జమదర్‌పాలిలోని రన్‌వేపై అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. దీంతో ఆ రన్‌వే పొడవునా వేలాది మంది అభ్యర్థులు వరుసగా కూర్చొని పరీక్ష రాశారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు, భద్రత కోసం భారీగా పోలీస్ అధికారులు, సిబ్బందిని మోహరించారు. అలాగే అభ్యర్థుల పరీక్షను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మరోవైపు 187 హోంగార్డుల పోస్టుల భర్తీకి కనీస అర్హత 5వ తరగతి ఉత్తీర్ణత. అయితే ఉన్నత విద్యావంతులు వేల సంఖ్యలో దరఖాస్తు చేశారు. సంబల్‌పూర్ జిల్లాకు చెందిన గ్రాడ్యుయేట్లు, ఇంజినీర్లు, కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ, ఎంబీఏ చదివినవారు, డిప్లొమా హోల్డర్లు, ఐటీఐ శిక్షణ పొందిన అభ్యర్థులు హోంగార్డు ఉద్యోగం కోసం పోటీ పడ్డారు.

### శబరిమలలో ఫుడ్ సేఫ్టీ డ్రైవ్




కేరళ శబరిమల సన్నిధానం పర్యవేక్షణకు అధికారులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. సన్నిధానం పరిసరాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫుడ్ కాంప్లెక్స్‌లు ఇతర వ్యాపార సముదాయాలలో అధికారులు సేఫ్టీ డ్రైవ్ చేపట్టారు. పరిశుభ్రత లేకపోవడంతో పాటు సరైన నిబంధనలు పాటించిన వ్యాపార సముదాయాలకు జరిమానా విధించారు. అయ్యప్ప సన్నిధాన పవిత్రతను కాపాడడానికి దేవస్థానం బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుంది. ఇది వరకే శబరిమలలో ప్లాస్టిక్ వాడకంపై పూర్తిగా నిషేదం విధించారు. ఈ నేపథ్యంలో శబరిమలలోని హోటళ్లు, ఫుడ్‌కోర్టులు, ఇతర వ్యాపార సముదాయాలలో అధికారులు సేఫ్టీ డ్రైవ్ చేపట్టారు. పరిశుభ్రత లేకుండా నిబంధనలకు అనుగుణంగా లేని వాటిపై దాదాపు రూ. 98 వేల జరిమానా విధించారు. భక్తులు రద్దీని దృష్టిని ఉంచుకొని అధిక ధరలకు వస్తువుల అమ్మడం, సరైన పరిశుభ్రత పాటించకపోవడం తదితర అంశాలను ఆరా తీశారు. ఆహార పదార్థల ధరలను పట్టికలో పొందుపర్చాలని వాటిని ఎట్టి పరిస్థితుల్లో అధిక ధరలకు అమ్మకూడదని తెలిపారు. చలి తీవ్రత దృష్ట్యా భక్తులకు కచ్చితంగా వేడినీటినే సరఫరా చేయాలని కూల్ వాటర్ ఇవ్వకూడదని తెలిపారు. అదే విధంగా దేవస్థానం ఉద్యోగస్థుల పేరుతో మోసం చేసే వారిపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

### సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు



నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు నిరాకరించింది. ఈ తీర్పును ఈడీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. దీంతో రాహుల్, సోనియా గాంధీతో పాటు ఈ కేసులోని ఇతరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపే ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించింది. అందుకు బదులుగా ఏజేఎల్ కంపెనీ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుంది. అయితే ఈ వ్యవహారంలో సోనియా, రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండేజ్, సుమన్ దూబే తదితరులు మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఏజేఎల్ కంపెనీ ఆస్తులను స్వాధీనం చేసుకున్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన వాటా దారులుగా ఉన్నారు. ఈ సంస్థ కేవలం రూ.50 లక్షలు చెల్లించి ఏజేఎల్‌కు చెందిన సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులు పొందారని ఈడీ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది.

### అటవీ భూముల ఆక్రమణ..

### సుమోటో కేసుగా స్వీకరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లో భారీ స్థాయిలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ అంశంపై దాఖలైన పిటీషన్‌ను ఇవాళ సుప్రీంకోర్టు స్వీకరించింది. అటవీ భూముల్ని ఆక్రమిస్తుంటే, స్థానిక రాష్ట్ర ప్రభుత్వం మూగ ప్రేక్షకుడిలా కూర్చున్నదని సుప్రీం ధర్మాసనం పేర్కొన్నది. అటవీ భూముల ఆక్రమణ కేసును సుమోటోగా స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌ను విచారించింది. ఎంక్వైరీ కమిటీ వేసి, ఆ రిపోర్టును సమర్పించాలని ఉత్తరాఖండ్ చీఫ్ సెక్రటరీని ధర్మాసనం ఆదేశించింది. కండ్ల ముందే అటవీ భూమిని లాగేసుకుంటుంటే, ఉత్తరాఖండ్ అధికారులు మూగ ప్రేక్షకుల్లా ఉండడం షాక్‌కు గురి చేస్తున్నదని, అందుకే దీన్ని సుమోటో కేసుగా స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది. చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ కన్జర్వేషన్ సెక్రటరీ నివేదిక ఇచ్చే వరకు థార్డ్ పార్టీ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దు అని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. నివాసిత ఇండ్ల మినహా ఖాళీ భూములను అటవీశాఖ తమ ఆధీనంలోకి తీసుకోవాలని కోర్టు తన ఆదేశాల్లో వెల్లడించింది. అనితా ఖండ్వాల్ దాఖలు చేసిన పిటీషన్‌పై కోర్టు వాదనలు చేపట్టింది.

### కర్ణాటకలో సీఎం మార్పును డిసైడ్ చేసేది ఆయనే



కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొనసాగుతున్న ఊహాగా నాలకు తెరదించేలా సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సీఎం మార్పు రగడపై అగ్రనేత నేత రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికే తామంతా కట్టుబడి ఉంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన సొంతూరు మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం మార్పుపై మీడియా పదేపదే చర్చించడంపై సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. "ఈ విషయంపై ఇన్ని ప్రశ్నలు ఎందుకు? నేను ఇప్పటికే శాసనసభలో దీని గురించి మాట్లాడాను. మళ్ళీ చర్చ అనవసరం" అని అన్నారు. తాను పూర్తికాలం సీఎంగా కొనసాగుతానని ఇటీవల అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సిద్ధరామయ్య, తాజా వ్యాఖ్యలతో బంతిని అధిష్ఠానం కోర్టులోకి నెట్టారు. గతవారం మంత్రి కేఎన్ రాజన్న, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయిన విషయంపై అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ.. "డీకే శివకుమార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు. ఆయన్ను కలవడంలో తప్పేముంది?" అని ప్రశ్నించారు. మరోవైపు, సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య ఆధిపత్య పోరుపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ సమస్యను పరిష్కరించే సత్తా లేదని ఎద్దేవా చేస్తోంది. ఈ వారంలో డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు వెళ్లనుండటం, శనివారం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి సిద్ధరామయ్యకు ఆహ్వానం అందే అవకాశం ఉండటంతో.. కర్ణాటక రాజకీయాలు మరింత వేడెక్కాయి.

### బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న హింస

బంగ్లాదేశ్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. ప్రముఖ విద్యార్థి నేత ఉస్మాన్ హాదీ హత్యోదంతం మరిచిపోక ముందే, అదే పార్టీకి చెందిన మరో నాయకుడిపై హత్యాయత్నం జరిగింది. సోమవారం ఉదయం ఖుల్నా నగరంలో నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) నేత మహమ్మద్ మొతాలెబ్ షిక్దర్‌పై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, ఉదయం 11:45 గంటల సమయంలో దుండగులు షిక్దర్‌ను లక్ష్యంగా చేసుకుని కాల్చడంతో బుల్లెట్ ఆయన తలలోకి దూసుకెళ్లింది. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని, చికిత్స అందిస్తున్నామని దర్యాప్తు అధికారి అనిమేష్ మోండల్ తెలిపారు. ఘటనపై విచారణ ప్రారంభించినట్లు వెల్లడించారు. గతవారం డిసెంబర్ 12న ఢాకాలో ఎన్‌సీపీకే చెందిన ప్రముఖ నేత షరీఫ్ ఉస్మాన్ హాదీని ముసుగులు ధరించిన దుండగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. భారత వ్యతిరేక వ్యాఖ్యలతో గుర్తింపు పొందిన హాదీ, మాజీ ప్రధాని షేక్ హసీనాను గద్దె దించడానికి కారణమైన విద్యార్థి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఆయన మరణం తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు, హింసాత్మక ఘటనలు చెలరేగాయి. ముఖ్యంగా మైనారిటీలపై దాడులు పెరిగాయి. గతేడాది జరిగిన భారీ విద్యార్థి నిరసనల నుంచి ఎన్‌సీపీ ఆవిర్భవించింది. 2026 ఫిబ్రవరిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ పార్టీ పోటీ చేయనుంది. ఈ నేపథ్యంలో వరుసగా విద్యార్థి నేతలపై జరుగుతున్న దాడులు దేశంలో తీవ్ర రాజకీయ అస్థిరతకు, ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి.

# శాస్త్రీయంగానే సాగిన డివిజన్ల పునర్విభజన




ఇప్పుడు హైదరాబాద్ మహా నగరం చాలా పెద్ద సామ్రాజ్యంగా మారనుంది. 27 పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో 2000 చ.కి.మీ విస్తీర్ణంతో ఉండనుంది. గ్రేటర్ నగరం శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కలుపుకొని బృహత్ నగరంగా మారింది. 150 వార్డులు కాస్త 300కి పెరిగాయి. దీని వెనుక శాస్త్రీయ కసరత్తు జరిగిందని అధికారులు చెబుతున్నారు.

సమాన ప్రాతినిధ్యం : ప్రతి వార్డులో జనాభా సుమారుగా ఉండేలా పునర్విభజన చేశారు. ఇప్పటివరకు కొన్ని వార్డుల్లో కార్పొరేటర్లు ఎక్కువ జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, మరికొన్ని తక్కువగా ఉండేవి. ఇప్పుడు సమాన ప్రాతినిధ్యం ఏర్పడింది.

**సేవలు మెరుగు**

ఒక కాలనీ రెండు డివిజన్లలో ఉండేది. ప్రస్తుతం సహజ సరిహద్దులు అంటే రహదారి, నాలాలు, చెరువుల ఆధారంగానే నిర్ధారించేవారు. ఫలితంగా సేవలు అనేవి మెరుగుపడతాయి.

**ప్రణాళిక సులువు**

జనాభా ఆధారిత డివిజన్ల పునర్విభజనతో మౌలిక సదుపాయాల ప్రణాళిక వాస్తవికంగా ఉంటుంది. రహదారి విస్తీర్ణం, డ్రైనేజీ సామర్థ్యం, నీటి, గృహ నిర్మాణ అవసరాలను ముందుగానే అంచనా వేయవచ్చు.

**విలీన ప్రాంతాల ఏకీకరణ**

జీహెచ్ఎంసీతో సమానంగా విలీన ప్రాంతాలు ఏకరీతి సేవలు పొందుతాయి. ఐటీ కారిడార్లు, ఎయిర్‌పోర్టు జోన్లు, ఓఆర్ఆర్ ప్రాంతాల్లో ఏకీకృత అభివృద్ధి అనేది సాధ్యం అవుతుంది.

**ఉదాహరణకు :**

కోర్ డివిజన్లలో అమీర్‌పేట, కూకట్‌పల్లిలో వాణిజ్య, నివాస, అధిక వలసలు ఉండే ప్రాంతాలు. ఇక్కడ డివిజన్ల పునర్విభజనతో జనాభా భారాన్ని విభజిస్తుంది. మొబిలిటీ ప్రణాళిక మెరుగు అవుతుంది.ఓఆర్ఆర్ ప్రభావిత ప్రాంతాలైన నిజాంపేట, మణికొండ, తెల్లాపూర్‌లో ఆకాశహర్మ్యాలు, పెరుగుతున్న పౌర అవసరాలకు అనుగుణంగా డివిజన్ల విభజన ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ వేగవంతమైన మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యం అవుతుందని అంటున్నారు.

దమ్మాయిగూడలో ఎక్కువ వార్డులు ఉండేవి. ఇప్పుడు డివిజన్ల విభజనతో తక్కువ డివిజన్లతో పరిపాలన సౌలభ్యం ఏర్పడుతుంది.

"హైదరాబాద్‌ను మరింత సమర్థవంతమైన మహానగరంగా తీర్చిదిద్దుతుంది. అనియంత్రిత అభివృద్ధి తగ్గి, పర్యావరణ హిత, సుస్థిరాభివృద్ధికి బాటలు వేస్తుంది. అందుకు పునర్విభజన దోహదం చేస్తుంది. ఇప్పటికీ స్వీకరించిన అభ్యంతరాలను పరిష్కరించాం. ప్రజాభిప్రాయం మేరకు పలు సవరణలు చేశాం. ఒకటి రెండు రోజుల్లోనే తుది నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది." – ఆర్వీ కర్ణన్, కమిషనర్, జీహెచ్ఎంసీ

**జీహెచ్ఎంసీలో 27 పట్టణ స్థానిక సంస్థలు**

హైదరాబాద్ మహానగరం బృహత్ నగరంగా ఆవిష్కృతం అయిందన విషయం తెలిసిందే. ఈ జీహెచ్ఎంసీ విస్తరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం కేవలం వారం రోజుల వ్యవధిలోనే పూర్తి చేసింది. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న 20 పురపాలక సంఘాలు, 7 నగరపాలక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హైదరాబాద్ మహానగర సరిహద్దులు అనేవి ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాయి. ఈ విస్తరణ ప్రణాళికకు నవంబరు 25న మంత్రివర్గం ఆమోదించగా, డిసెంబరు 1న జీహెచ్ఎంసీ చట్టం చేయగా, తెలంగాణ పురపాలక చట్టాల సవరణకు గవర్నర్ ఆమోదముద్ర వేయడం వంటి పనులు వెనువెంటనే జరిగిపోయాయి. దీంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు డిసెంబరు 2 నుంచే 27 పట్టణ స్థానిక సంస్థలు జీహెచ్ఎంసీలో విలీనమైనట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**అప్పుడు అసలేం జరిగింది**

హైదరాబాద్, సికింద్రాబాద్ మున్సిపాలిటీల విలీనంతో 1955లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్(ఎంసీహెచ్)ను ఏర్పాటు చేశారు. తర్వాత రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని ఎల్బీనగర్, ఉప్పల్, గడ్డి అన్నారం, మల్కాజిగిరి, కాప్రా, అల్వాల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, రాజేంద్రనగర్, రామచంద్రాపురం మున్సిపాలిటీలను, పలు గ్రామాలను ఎంసీహెచ్‌లో విలీనం చేశారు. ఆ విలీనం తర్వాత 2007లో జీహెచ్ఎంసీని ఏర్పాటు చేశారు. ఇప్పుడు మళ్లీ 2025లో జీహెచ్ఎంసీలో 27 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ మహానగర విస్తీర్ణం 900 చ.కి.మీ నుంచి 2000 చ.కి.మీ.లకు పెరిగింది.

# పంజా విసురుతున్న చలి
# డేంజర్‌లో హైదరాబాద్ ఎయిర్



**హైదరాబాద్ :** తెలంగాణలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ప్రజలు గజగజా వణికిపోతున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలోనే అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఐదు డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దాదాపు 15 జిల్లాల్లో 10డిగ్రీల సెల్సియస్ లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, అదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని అనేక మండలాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. అయితే, తెలంగాణలోని మమంగళ, బుధవారాల్లో చలితీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.తెలంగాణపై చలి పులి పంజా విసురుతోంది. రికార్డు స్థాయి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో బయటకు రావాలంటే ప్రజలు వణికిపోతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు చలి ఎక్కువగా ఉన్న సమయాల్లో బయటకు రావొద్దని, ఒకవేళ వచ్చినా చలి తీవ్రతను తట్టుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలాఉంటే.. హైదరాబాద్ నగరంలో ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం చేరింది.దేశ రాజధాని ఢిల్లీ సహా ఇతర నగరాలకు ముప్పుగా మారిన వాయు కాలుష్యం తాజాగా.. హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టింది. భాగ్యనగర వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 255కు చేరుకుని ప్రమాదకర స్థాయికి చేరింది. ముఖ్యంగా బాలానగర్, సనత్ నగర్, జీడిమెట్ల, మల్లాపూర్ వంటి పారిశ్రామిక, రద్దీ ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రంగా ఉంది. శీతాకాలపు పొగమంచుకు తోడు వాహనాల ఉద్గారాలు, చెత్త దహనం వల్ల గాలిలో సూక్ష్మ ధూళి కణాలు భారీగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సైనసైటిస్, డస్ట్ అలర్జీ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, ముఖ్యంగా ఉదయం వేళల్లో వ్యాయామాలకు దూరంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు రాత్రిపూట రాష్ట్ర వ్యాప్తంగా 4.5 నుంచి 11.12 డిగ్రీల సెల్సియస్ మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతతో ఉదయం 8గంటల తరువాతే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు.సంగారెడ్డి జిల్లాల్లో పదేళ్ల రికార్డు స్థాయి కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాలోని కోహిర్ లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 4.5డిగ్రీలు నమోదైంది. గతేడాది ఇదే సమయంలో 17.8డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ లో 4.8డిగ్రీలు నమోదైంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ పదేళ్లలోనే అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట మినహా మిగిలిన జిల్లాల్లో 10డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాల్లోనూ 11.2 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు రాత్రి, ఉదయం వేళ్లలో బయటకు రావొద్దని వైద్య నిపుణులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా చలి తీవ్రతను తట్టుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.హైదరాబాద్ నగరంలో కూడా ఈ ఏడాదిలోనే అత్యంత చలితీవ్రత నమోదైంది. నగరంలో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 10 డిగ్రీలుగా ఉన్నప్పటికీ.. జీహెచ్ఎంసీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇది ఇంకా తక్కువగా ఉంది. శేరిలింగంపల్లిలో 7.8డిగ్రీలు, మల్కాజిగిరి ప్రాంతంలో 8.3 డిగ్రీలు, రాజేంద్ర నగర్ ప్రాంతంలో 9.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# జనవరి చివరి తర్వాత...



**హైదరాబాద్ :** తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి ముగిసింది. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో గెలవగా.. బీఆర్ఎస్ కూడా గట్టి పోటీ ఇచ్చింది. మొత్తం మూడు విడతలుగా ఎన్నికలు జరగ్గా.. 1205 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 11,497 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 1,25,23,137 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 85.360 శాతం పోలింగ్ నమోదైంది. కాంగ్రెస్ మద్దతుదారులు 7,010, బీఆర్ఎస్ మద్దతుదారులు 3502 మంది గెలిచారు. ఇక బీజేపీ 688 స్థానాలను దక్కించుకుంది.సర్పంచ్ ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు అందరూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అయితే ఓటర్ల సమగ్ర సవరణ జాబితా సిద్ధం చేయాల్సి ఉండటం వల్ల ఈ ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతోంది. వచ్చే ఏడాది జనవరి తొలి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర సవరణ జాబితా విడుదల చేసే అవకాశముంది. ఈ జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. సర్పంచ్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ న్యాయపరమైన చిక్కుల వల్ల ఆగిపోయాయి. ఓటర్ల సవరణ జాబితా వచ్చిన తర్వాత ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఓటర్ల సవరణ జాబితా అందిన తర్వాత వార్డుల వారీగా ఓటర్ల విభజన చేయాల్సి ఉంటుంది. దీంతో జనవరి చివరి నాటికి ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది.ఇక ఫిబ్రవరిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని తెలుస్తోంది. అలాగే మున్సిపల్ ఎన్నికలను కూడా నిర్వహించాల్సి ఉంది. అయితే మున్సిపల్ వార్డుల విభజనకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం ఇంకా ఈసీకి అందించలేదు. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముంది. దీంతో ఫిబ్రవరిలో మిగిలిన స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశముందని సమాచారం. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన జోష్‌లో కాంగ్రెస్ ఉండగా.. రాబోయే ఎన్నికల్లో కూడా గట్టి పోటీ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

## కేసీఆర్ చెప్పేవన్నీ అసత్యాలే

-మొదటిపేజీ తరువాయి

పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకుండా మహబూబ్‌నగర్ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. సోమవారం పెద్దపల్లి జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించారు. ఈ సందర్భంగా గుంపుల, అడవి సోమనపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలను పరిశీలించారు. ఈ ఘటనపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంపుల, అడవి సోమనిపల్లి గ్రామాల్లో కూలిపోయిన చెక్ డ్యాంలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామని తెలిపారు. ఈ పనులను నాసిరకంగా, నాణ్యతలేమితో నిర్మించినా లేదా ఎవరైనా కావాలనే ధ్వంసం చేసినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని అన్నారు. ఈ విచారణను వేగవంతం చేసి బాధ్యులను గుర్తించాలని ఇప్పటికే విజిలెన్స్ అధికారులను ఆదేశించామని అన్నారు. రైతన్నలకు మేలు చేసే చెక్ డ్యాంలను ఎవరైనా కావాలని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే ఊపేక్షించబోమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

**హరీశ్‌రావు పేరు మార్చుకో..**

'నీటి వాటాలో 71 శాతం మాకు 29శాతం ఏపీకి ఇవ్వాలని మేము పోరాడుతున్నాం. 17 జనవరి 2024, ఫిబ్రవరిలో కేఆర్ఎంబీకి లేఖ ఇచ్చాం. ఇరిగేషన్ కాంట్రాక్టర్ల లిస్ట్ తీయండి. కేసీఆర్ హయంలో లాగా ఏపీ కాంట్రాక్టర్లకు మేము ఇచ్చామా..? హరీశ్‌రావు పేరు మార్చుకుని గోబెల్స్ అని పెట్టుకోవాలి. కాళేశ్వరం విషయంలో పదే పదే అసత్యాలు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలి. తెలంగాణ ప్రజల తలను తాకట్టు పెట్టి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్. కాళేశ్వరం నుంచి గత ఐదేళ్లలో 70 టీఎంసీల నీళ్లను మాత్రమే ఉపయోగించారు. హరీశ్‌రావు అతి తెలివితేటలు వాడటం ప్రజలు గమనిస్తున్నారు. కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు జరిగిన అపెక్స్ కౌన్సిల్ భేటీల్లో కేసీఆర్ సంతకాలు పెట్టారు' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తావించారు.

**ఎస్ఎల్‌బీసీ ఎందుకు పూర్తి చేయలేదు..**

'పాలమూరు, డిండి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు. కేసీఆర్, హరీశ్‌రావు బరితెగించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ అప్పులు తీర్చడానికి మా ప్రభుత్వం ఏడాదికి రూ.16 వేల కోట్లు కడుతుంది. కాళేశ్వరం పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. సిగ్గులేకుండా మళ్లీ ఇప్పుడు కేసీఆర్, హరీశ్‌రావు మాట్లాడుతున్నారు. 45 టీఎంసీల లేఖ కొత్తది కాదు... బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న దానినే మేము లేఖలో రాశాం. 90 టీఎంసీలను గతంలో కేసీఆరే డివైడ్ చేసి 45టీఎంసీలుగా చేశారు. పాలమూరుకు ఇప్పటికీ పూర్తిగా పర్యావరణం అనుమతులు రాలేదు. పదేళ్ల పాటు పాలమూరు పూర్తి చేయకుండా అక్కడి ప్రజలను మోసం చేసింది కేసీఆరే. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 90శాతం పనులు పూర్తి అయితే... ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఎందుకు ఇవ్వలేదు' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు.

## కేటీఆర్‌తో ఫుట్‌బాల్
## ఎలా ఆడాలో సీఎం రేవంత్‌కు తెలుసు



**హైదరాబాద్ :** బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఎప్పుడో బీఆర్ఎస్‌ను ఫుట్‌బాల్ ఆడుకున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రపంచ ఆటగాడితోనే ఫుట్‌బాల్ ఆడినట్లు తెలిపారు. కేటీఆర్‌తో ఫుట్‌బాల్ ఎట్లా ఆడాలో సీఎం రేవంత్ రెడ్డికి తెలుసన్నారు. అధికారం పోయిందని అక్కసుతో హరీష్ రావు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హరీష్ రావుకు మించి తప్పుడు కూతలు, తప్పుడు మాటలు, గ్లోబల్ ప్రచారం ఎవరు చేయరని విమర్శించారు. అధికారం పోయాక ఎవరో వాళ్ళ ఇంట్లో పడి గుంజుకున్నట్టుగా ఫీలై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు బీఆర్ఎస్‌కు 10 సంవత్సరాలు అవకాశం ఇచ్చారని.. సరిగా పని చేయకపోతే ప్రజలు అధికారం నుంచి దింపేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ మంచిగా పని చేయనప్పుడు కాంగ్రెస్‌ను కూడా దించుతారని అన్నారు. కవితకు జవాబు చెప్పలేక కాంగ్రెస్ పార్టీ మీద పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలతో తాము పాజిటివ్ దృక్పథంతో ఉంటామని స్పష్టం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఫుట్‌బాల్ ఆడుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

## త్వరలో తెలంగాణలోనూ ఎస్ఐఆర్

-మొదటిపేజీ తరువాయి



మందితో ఓటర్ల జాబితాను విడుదల చేశాం. అందుకు ఎలాంటి సమస్య రాలేదు. వాటిపై ఫిర్యాదు కూడా రాలేదు. అక్కడ ఎన్నికలు జరిగాక ఈవీఎంలు, వీవీప్యాట్లపై కూడా ఎలాంటి ఫిర్యాదు అందలేదు. రీపోలింగ్, రీకౌంటింగ్ అవసరం రాలేదు" అని వివరించారు. "తెలంగాణలో సగటున 930 మంది ఓటర్లకు ఒక బీఎల్‌వో ఉంటారు. ఇప్పటికే ఎస్ఐఆర్ చేసిన చోట్ల చనిపోయిన వారి పేర్లు, ఒక వ్యక్తికి రెండు ఓట్లు వంటివి కనిపించాయి. ఇలాంటివి తెలంగాణలోనూ ఉండవచ్చు. ఎస్?ఐఆర్? ద్వారా అలాంటి వాటిని సవరించాలి. దేశంలో రాజ్యాంగానికి అతి పెద్ద సైనికుడు బీఎల్?వోనే. ప్రస్తుతం దేశంలో ఎన్నికల కోసం 1.80 కోట్ల మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఏడు దేశాల నుంచి 20 మంది ప్రతినిధులు వచ్చి బిహార్ ఎన్నికలను పరిశీలించారు" – జ్ఞానేశ్? కుమార్, సీఈసీ

తెలంగాణలోని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు, ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బందికి సంబంధించిన అంశాలను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి సుదర్శన్? రెడ్డి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డిప్యూటీ సీఈసీ పవన్‌కుమార్ శర్మ, అదనపు ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, రాష్ట్ర ఉప ఎన్నికల అధికారి హరిసింగ్ పాల్గొన్నారు.

**ఆధార్ కార్డు కేవలం ఐడెంటిటీ కార్డు కాదు**

ఈ సమావేశంలో బీఎల్‌వోలు అడిగిన ప్రశ్నలకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సమాధానాలిచ్చారు. పట్టణ ప్రాంతాల పోలింగ్ శాతం తక్కువగా ఉండటానికి స్థానిక ఓటర్ల నిరాసక్తతే ప్రధాన కారణమని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు మాత్రం ఉత్సాహంగా క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగిస్తూ దేశానికి దారి చూపుతున్నారని కొనియాడారు. దేశంలో ఎన్నికలు పూర్తిగా చట్టప్రకారమే జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

**బీఎల్‌వోలకు రూ.6 వేల నుంచి రూ.12 వేలు**

ఎన్నికల నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిందేనని అన్నారు. వలస ఓటర్లు ఏదైనా ఒక ప్రాంతంలో ఓటింగ్?ను కలిగి ఉండాలని చెప్పారు. బీఎల్?వోల గౌరవ వేతనం రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు పెంచామని తెలిపారు. ఆధార్? కార్డు అనేది కేవలం ఐడెంటిటీ కార్డు మాత్రమేనని, ఇది దేశ పౌరసత్వాన్ని, పుట్టిన తేదీని ధ్రువీకరించే కార్డు కాదని జ్ఞానేశ్‌కుమార్ అన్నారు. ఓటరు నమోదులో ఆధార్? కార్డు ఒక ఆప్షన్ మాత్రమేనని సీఈసీ వివరించారు.

**65 లక్షల మంది పేర్లను తొలగింపు**

ఎలక్షన్ కమిషన్ బిహార్‌లో ఇటీవల ఎస్ఐఆర్ చేపట్టి ఒక ముసాయిదా జాబితాను విడుదల చేసింది. అందులో ఏకంగా 65 లక్షల మంది పేర్లను తొలగించినట్లు తెలిపింది. దీనిపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఓట్ల చోరీ జరిగిందని ఆరోపణలూ వచ్చాయి. అయితే దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం మాత్రం తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల జాబితాను ప్రచురించాలని ఈసీని ఆదేశించింది.

# వాయు కాలుష్యం ఊపిరితిత్తులకు హాని కలిగిస్తుందా?



గాలి నాణ్యత సూచికలో మార్పులు చాలా శ్వాసకోశ సమస్యలను కలిగిస్తున్నాయి . కానీ ఇటీవల కేంద్ర ప్రభుత్వం దీనిని పరిష్కరించడానికి ఏమీ చేయడం లేదని ప్రశ్న తలెత్తినప్పుడు, కేంద్ర పర్యావరణ మంత్రి దీనిని ఖండించారు. శ్వాసకోశ సమస్యలతో దీనికి సంబంధం లేదని అన్నారు. దీనికి తగినంత ఆధారాలు లేవని ఇటీవల చర్చనీయాంశమైంది. దీని వెనుక నిజం ఏమిటి? పర్యావరణ మార్పులకు, ముఖ్యంగా గాలి నాణ్యత సూచిక స్థాయికి మరియు శ్వాసకోశ సమస్యలకు మధ్య ఏదైనా సంబంధం ఉందా? లేదా? ఇక్కడ మనం చూడబోతున్నాం. ఊపిరితిత్తుల సామర్థ్యంపై ప్రభావం: గాలి నాణ్యత సూచిక స్థాయిలలో నిరంతర మార్పులు వివిధ ఆరోగ్య సమస్యలు, పర్యావరణ సమస్యలను కలిగిస్తాయి. ముఖ్యంగా గాలి నాణ్యత సూచిక స్థాయి చాలా పేలవంగా ఉండి చాలా కాలం పాటు కొనసాగినప్పుడు, అది ఊపిరితిత్తుల సామర్థ్యం తగ్గడానికి కారణమవుతుంది. అంటే, పల్మనరీ ఫైబ్రోసిస్ అభివృద్ధి చెందే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అనేక వైద్య అధ్యయనాలు నిరూపించాయి. ఢిల్లీ, ఇతర పెద్ద నగరాలు మీకు ఏమీ తెలియదు. శీతాకాలం వచ్చినప్పుడు, ఢిల్లీ విపరీతమైన వాయు కాలుష్య ప్రదేశంగా మారుతుంది, అక్కడ పొగమంచు తప్ప మరేమీ ఉండవు. గాలి నాణ్యత సూచిక బాగా ఉన్న ఇతర పెద్ద నగరాలతో పోలిస్తే, ఢిల్లీ వాసులు అత్యంత తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా, వారి ఊపిరితిత్తుల వశ్యత దాదాపు 50% తగ్గిందని చెబుతారు. గాలి నాణ్యత లేకపోవడం వల్ల కలిగే సమస్యలు: సాధారణంగా, గాలి నాణ్యత నిరంతరం ప్రభావితమైనప్పుడు, మనం ఎదుర్కొనే మొదటి సమస్య చాలా స్పష్టంగా ఉంటుంది. సమస్య ఏమిటంటే శరీరం నిర్జలీకరణం చెందుతుంది మరియు చర్మం చాలా పొడిగా మారుతుంది. చర్మం పొరలుగా మారడం, పల్మనరీ ఫైబ్రోసిస్, సిఒపిడి, ఎంఫిసెమా, మొత్తం ఊపిరితిత్తుల పనితీరు బలహీనత, ఊపిరితిత్తుల స్థితిస్థాపకత కోల్పోవడం చాలా సాధారణం. తీసుకోవలసిన నివారణ చర్యలు: వాతావరణ మార్పు మానవ ఆరోగ్యంపై భారీ ప్రభావాన్ని చూపుతుంది. మనం దానిని నివారించాలనుకుంటే, దాని గురించి అవగాహన, విద్య, ముందు జాగ్రత్త చర్యలు, తగిన వైద్య సౌకర్యాలు, వాయు కాలుష్యం గురించి ప్రజలలో అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. తీసుకోవలసిన నివారణ చర్యలు: వాతావరణ మార్పు మానవ ఆరోగ్యంపై భారీ ప్రభావాన్ని చూపుతుంది. మనం దానిని నివారించాలనుకుంటే, దాని గురించి అవగాహన, విద్య, ముందు జాగ్రత్త చర్యలు, తగిన వైద్య సౌకర్యాలు, వాయు కాలుష్యం గురించి ప్రజలలో అవగాహన కల్పించడం చాలా ముఖ్యం.

# రోజూ ఎనర్జీ డ్రింక్స్ తాగుతున్నారా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అలసటను దూరం చేసుకునేందుకు చాలా మంది తక్షణ పరిష్కారంగా ఎనర్జీ డ్రింక్స్ పై ఆధారపడుతున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అలసటను దూరం చేసుకునేందుకు చాలా మంది తక్షణ పరిష్కారంగా ఎనర్జీ డ్రింక్స్ పై ఆధారపడుతున్నారు. ఆఫీస్ పనిలో ఉన్నా, జిమ్‌లో కష్టపడుతున్నా, రాత్రంతా చదవాలన్నా ఒక టిన్ ఎనర్జీ డ్రింక్ తాగితే చాలు.. కొండంత శక్తి వస్తుందని నమ్ముతారు. కానీ, ఈ అలవాటు మీ ఆరోగ్యానికి ఎంతటి చేటు చేస్తుందో ఎప్పుడైనా ఆలోచించారా? ఎనర్జీ డ్రింక్స్‌లో ఏముంటుంది? చాలా మంది వీటిని కేవలం పండ్ల రసాలు లేదా సాఫ్ట్ డ్రింక్స్ లాగే భావిస్తారు. కానీ వీటిలో ప్రధానంగా రెండు అంశాలు ఉంటాయి. అధిక మొత్తంలో కెఫీన్ అంటే సాధారణ కాఫీ కంటే వీటిలో కెఫీన్ పరిమాణం చాలా ఎక్కువ. అంతేకాదు, వీటివల్ల ఒకేసారి అధిక మొత్తంలో చక్కెర శరీరంలోకి వెళు ుంది. వీటితో పాటు టౌరిన్, గ్వారానా వంటి ఉత్ప్రేరకాలు కూడా ఉంటాయి. ఇవి గుండెపై తీవ్ర ప్రభావం చూపుతాయి. రోజూ తాగితే అనర్థమే.. ఎనర్జీ డ్రింక్స్ తాగగానే రక్తపోటు ఒక్కసారిగా పెరుగుతుంది. రోజూ తాగడం వల్ల గుండె కొట్టుకునే వేగం అసాధారణంగా పెరిగి, గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిలోని అధిక కెఫీన్ మీ నిద్రను దూరం చేస్తుంది. ఫలితంగా మెదడుపై ఒత్తిడి పెరిగి చిరాకు, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండటం వల్ల కిడ్నీలపై భారం పడుతుంది. ఇది దీర్ఘకాలంలో కిడ్నీ ఫెయిల్యూర్లకు దారితీయవచ్చు. ఎనర్జీ డ్రింక్స్ వల్ల శరీరంలోని కాల్షియం స్థాయిలు తగ్గి, ఎముకలు బలహీనపడే అవకాశం ఉంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఎనర్జీ డ్రింక్స్‌ను రోజువారీ అలవాటుగా మార్చుకోకూడదు. ఏదో ఒక సందర్భంలో తాగితే పర్వాలేదు కానీ, రోజూ తాగడం వల్ల శరీరానికి శక్తి అందడం పక్కన పెడితే, అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. తక్షణ శక్తి కోసం వీటికి బదులుగా.. మంచినీరు ఎక్కువగా తాగడం, కొబ్బరి నీళ్లు, తాజా పండ్ల రసాలు తీసుకోవడం, తగినంత నిద్రపోవడం వంటివి మేలని సూచిస్తున్నారు. చిన్నపాటి అలసటను దూరం చేసుకునేందుకు ఎనర్జీ డ్రింక్స్‌ను ఆశ్రయించి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు. శక్తి అనేది సహజమైన ఆహారం మరియు విశ్రాంతి ద్వారా రావాలి తప్ప.. కెమికల్ డ్రింక్స్ ద్వారా కాదు. ఈ విషయంలో యువత మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# కరివేపాకును ఏరి పారేస్తున్నారా!

భారతీయ వంటకాల్లో కేవలం సువాసన కోసం మాత్రమే వాడే కరివేపాకు వెనుక అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. అమ్మమ్మల కాలం నాటి చిట్కాలకే పరిమితమైన ఈ ఆకులు, ఇప్పుడు ఆధునిక వైద్య శాస్త్ర పరిశోధనల్లోనూ తమ శక్తిని చాటుకుంటున్నాయి. కేవలం రుచిని పెంచడమే కాకుండా ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో కరివేపాకు ఎంతగానో దోహదపడుతుందని శాస్త్రవేత్తలు ధృవీకరిస్తున్నారు. ప్రతి ఇంట్లో కరివేపాకు లేకుండా పోపు పూర్తి కాదు. అయితే చాలా మంది భోజనం చేసేటప్పుడు వీటిని ఏరి పక్కన పడేస్తుంటారు. కానీ ఈ చిన్న ఆకుల్లో ఉండే పోషక విలువలు తెలిస్తే, మీరు మళ్ళీ ఎన్నడూ అలా చేయరు. జీర్ణక్రియకు దివ్యౌషధం: కరివేపాకులో ఉండే జీర్ణ ఎంజైమ్‌లు ఉబ్బరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా కరివేపాకును వేడి నూనెలో వేసినప్పుడు విడుదలయ్యే గిరినింబైన్ అనే సమ్మేళనం కడుపు పూతలను తగ్గిస్తుంది. ఇది పేగుల అంతర్గత పొరను రక్షిస్తూ, ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. బరువు తగ్గడం: కరివేపాకులోని మహానింబైన్ అనే సమ్మేళనం శరీరంలోని మెటబాలిజంను పెంచుతుంది. ఇది కొవ్వు పేరుకుపోవడాన్ని అరికట్టడమే కాకుండా ఆకలిని నియంత్రణలో ఉంచుతుంది. స్థూలకాయంతో బాధపడేవారు తమ ఆహారంలో కరివేపాకును చేర్చుకోవడం వల్ల సహజంగా బరువు తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. డయాబెటిస్ నియంత్రణ: కరివేపాకులో ఉండే యాంటీ-హైపోగ్లైసీమిక్ లక్షణాలు రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరిస్తాయి. ఖాళీ కడుపుతో కరివేపాకు ఆకులను నమలడం లేదా వాటి సారం తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తుంది. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు: నేటి కాలుష్య భరిత వాతావరణంలో మన శరీర కణాలు ఆక్సీకరణ ఒత్తిడికి గురవుతాయి. కరివేపాకులోని యాంటీఆక్సిడెంట్లు కణాలను రక్షించి, అంతర్గత అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గిస్తుంది. జుట్టు పెరుగుదల - కుదుళ్ల బలం: కరివేపాకు జుట్టు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో అందరికీ తెలిసిందే. ఇందులోని అమైనో ఆమ్లాలు, విటమిన్లు జుట్టు కుదుళ్లకు పోషణనిస్తాయి. జుట్టు రాలడాన్ని తగ్గించి, అకాల తెల్ల జుట్టును నివారిస్తుంది. తల చర్మంలో రక్త ప్రసరణను పెంచి జుట్టు వేగంగా పెరిగేలా చేస్తుంది. గుండె ఆరోగ్యం: కరివేపాకు సారం శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను దాదాపు 12శాతం వరకు తగ్గించగలదని అధ్యయనాలు వెల్లడించాయి. ఇందులోని ఫైబర్, బీటా-కెరోటిన్, విటమిన్-సి రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా చూస్తాయి. తద్వారా గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది.



# విటమిన్ డి లోపాన్ని ఎలా పోగొట్టాలి?



కీళ్లే కాకుండా శరీరంలో అనేక రకాల సమస్యలు ఉంటాయి. విటమిన్ డి లేకపోవడం వల్ల శరీరం బలహీనత గురించి ఫిర్యాదు చేస్తుంది. వ్యక్తి మరింత అలసిపోయినట్లు అనిపిస్తుంది. శరీరం మెరుగైన రోగనిరోధక శక్తికి విటమిన్ డి చాలా ముఖ్యమైనది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి రకరకాల విటమిన్లు అవసరం. కానీ తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల శరీరంలో విటమిన్ లోపం ఏర్పడుతుంది. ఈ రోజుల్లో విటమిన్ డి లోపానికి సంబంధించిన అనేక ఉదంతాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఈ విటమిన్ లోపం వల్ల శరీరంలో కండరాలు, ఎముకల బలహీనతకు సంబంధించిన సమస్యలు వస్తాయి. దీని లోపం వల్ల జుట్టు రాలడంతోపాటు కొన్ని సందర్భాల్లో మానసిక సమస్యలు తలెత్తుతాయి. అటువంటి పరిస్థితిలో విటమిన్ డి లోపం లక్షణాలు, కారణాలు, నివారణ గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. శరీరంలో విటమిన్ డి లోపం ఉంటే, అది కీళ్ల నొప్పుల సమస్యను కలిగిస్తుంది. . కీళ్లే కాకుండా శరీరంలో అనేక రకాల సమస్యలు ఉంటాయి. విటమిన్ డి లేకపోవడం వల్ల శరీరం బలహీనత గురించి ఫిర్యాదు చేస్తుంది. వ్యక్తి మరింత అలసిపోయినట్లు అనిపిస్తుంది. శరీరం మెరుగైన రోగనిరోధక శక్తికి విటమిన్ డి చాలా ముఖ్యమైనది. దాని లోపం వల్ల మనకు కూడా ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ప్రస్తుత రోజుల్లో విటమిన్ డి లోపం పెద్ద సమస్య అని ఢిల్లీ సీనియర్ డాక్టర్ కవల్జిత్ సింగ్ చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య ప్రతి రెండవ వ్యక్తిలో కనిపిస్తుంది. సూర్యరశ్మిని తీసుకోకపోవడం, ఆహారంపై శ్రద్ధ చూపకపోవడం వల్ల శరీరంలో విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. ఈ విటమిన్ లోపం మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. మంచి ఎముక, కీళ్ళు, జుట్టు, మానసిక ఆరోగ్యానికి విటమిన్ డి అవసరం. కానీ ఈరోజుల్లో తిండి, పానీయాల పట్ల శ్రద్ధ చూపడం లేదు.

# బ్రోకలీ రోజూ తింటే ఏమవుతుంది?



బ్రోకలీ పోషకాల పవర్‌హౌస్. యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఈ కూరగాయ క్యాన్సర్‌ను నివారించి, కాలేయాన్ని రక్షిస్తుంది. ఎముకలను బలోపేతం చేసి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడి, రక్తపోటును నియంత్రిస్తుంది. బ్రోకలీ సంపూర్ణ ఆరోగ్యానికి కీలకమైన ఆహారం. చూసేందుకు కాలీఫ్లవర్ లాగా కనిపించే బ్రోకలీ పోషకాల పవర్ హౌస్. ఆకుపచ్చ కూరగాయలో ఒకటైన బ్రోకలీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బ్రోకలీలో యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యంతో పాటు అందానికి కూడా అనేక విధాలుగా ప్రయోజనం చేకూరుస్తాయి. బ్రోకలీలో యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో ఉంటే సల్ఫోరఫేన్ అనే సమ్మేళనం ఫ్రీ రాడికల్స్ వల్ల శరీర కణాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతుంది. తద్వారా క్యాన్సర్ వంటి మహమ్మారి రాకుండా అడ్డుకోవచ్చు.బ్రోకలీలో గ్లూకోసినోలేట్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడంలో సహాయపడతాయి. తద్వారా కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. బ్రోకలీలో కాల్షియం, విటమిన్ కె వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలకు కావాల్సినంత బలం అందిస్తాయి. తద్వారా వయసు పెరిగినా ఎముకలు బలంగా ఉంటాయి. బ్రోకలీలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా అనేక రకాల ఇన్ఫెక్షన్లకు దూరంగా ఉండొచ్చు. బ్రోకలీలో డైటరీ ఫైబర్ మెండుగా ఉంటుంది. ఇది పేగులను ఆరోగ్యంగా ఉంచి మలబద్ధకం ఏర్పడకుండా కాపాడుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తుంది. అయితే పచ్చిగా తింటే మాత్రం జీర్ణ సమస్యలు వస్తాయి. బ్రోకలీలో పొటాషియం, ఫైబర్, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ వంటి గుండెకు మేలు చేసే పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచి హృదయ సంబంధ సమస్యలు రాకుండా కాపాడుతాయి.

# కేసీఆర్‌కు రేవంత్‌కు పోలికా?



**హైదరాబాద్ :** కేసీఆర్ లేవనెత్తిన ప్రాజెక్టుల అంశాలకు సమాధానం చెప్పలేక, రేవంత్ రెడ్డి తన చిట్ చాట్ రాజకీయాలతో తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నేత హరీష్ రావు మండిపడ్డారు. కేసీఆర్ ఒక స్టేట్స్ మన్ లాగా రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడితే, రేవంత్ రెడ్డి ఒక స్ట్రీట్ రౌడీ లాగా అత్యంత హీనమైన భాషలో మాట్లాడు తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్ నిర్వహించిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి గతంలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని అనుమతులు సాధిస్తే, ప్రస్తుత ప్రభుత్వం డీపీఆర్ వాపస్ తెచ్చుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 టీఎంసీలు చాలు అని ఢిల్లీకి లేఖ ఎందుకు రాశారు ఇది పాలమూరు గొంతు కోయడం కాదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు వంటి ప్రాజెక్టుల ద్వారా దాదాపు 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందని, ఈ వాస్తవాన్ని అబద్ధాలతో కప్పిపుచ్చలేరని హితవు పలికారు.మహాలక్ష్మి పథకం కింద రూ. 2500, రైతు భరోసా, పెన్షన్ల పెంపు వంటి హామీలు ఏమయ్యాయని హరీశ్ రావు ప్రశ్నించారు. నిధుల సమీకరణలో అనుభవం ఉందని చెప్పుకునే రేవంత్ రెడ్డి, ఆ అనుభవాన్ని కేవలం లూటీలకు, దోపిడీలకు మాత్రమే వాడుతున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో లక్షల ఎకరాలకు ఆయకట్టు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చిందా అని సవాల్ విసిరారు. సాగర్ కుడి కాల్వ నుంచి ఏపీ ప్రభుత్వం రోజుకు 10 వేల క్యూసెక్కుల నీరు తరలిస్తుంటే, రేవంత్ సర్కారు చేష్టలుడిగి చూస్తోందని ఎద్దేవా చేశారు.రేవంత్ రెడ్డి రాజకీయ చరిత్ర అంతా వెన్నుపోట్లమయమని, చొక్కాలు మార్చినంత సులభంగా పార్టీలు మార్చే ఆయనకు నైతికత గురించి మాట్లాడే హక్కు లేదని హరీశ్ రావు అన్నారు. 50 కోట్లు పెట్టి పీసీసీ పదవి కొన్నవని మీ పార్టీ నేతలే చెప్పారు. ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన దొంగవు నువ్వు అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రగతి గురించి టోనీ బ్లెయిర్ వంటి అంతర్జాతీయ ప్రతినిధులే ప్రశంసించారని, కానీ రేవంత్ మాత్రం రాజకీయాల కోసం రాష్ట్ర పరువు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెట్టిన కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టేందుకు పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తామని హరీశ్ రావు ప్రకటించారు. ఇప్పటికైనా 45 టీఎంసీలు చాలు అన్న లేఖను వెనక్కి తీసుకొని, 90 టీఎంసీల కోసం పోరాడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జల ప్రయోజనాల విషయంలో కేసీఆర్ ఏనాడూ రాజీపడలేదని, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి ద్రోహాన్ని ప్రజల ముందు ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.

### దమ్ముంటే చర్చకు రండి

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు-నిజాలపై చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానిస్తే, కేసీఆర్ అసెంబ్లీకి వస్తారో లేదో చెప్పకుండా ఇదివరకు చెప్పిన మాటలే చెబుతున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో యూరియా కోసం రైతులు పడ్డ కష్టాలు పత్రికా సాక్ష్యాలుగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.గట్టిగా మాట్లాడినంత మాత్రాన అబద్ధాలు నిజం కావని ఆయన అన్నారు. అసెంబ్లీకి వస్తే ద్రోహి ఎవరో ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడారని, ఇప్పుడు అవే మాటలను కేసీఆర్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఏ రోజు కూడా సరైన పాలన అందించలేదని ఆయన అన్నారు. అందుకే ప్రజలు ప్రజా పాలనకు ఓటేశారని ఎంపీ అన్నారు.

# ప్రతి సర్పంచ్ పెద్ద జీతగాడిలా పని చేయాలి

## వనపర్తినియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి.



**వనపర్తి :** సమన్వయంతో పనిచేద్దాం.గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం.గ్రామస్తులందరూ మనవారే పార్టీల కతీతంగా పని చేయండి.ప్రతి సర్పంచ్ పెద్ద జీతగాడిలా పనిచేయాలి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీం లో సర్పంచులు మీరు.సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే .గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేసి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారుసోమవారం కొత్తగా కొలువుతీరిన గ్రామ పాలకవర్గం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరై వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిశాయని గెలిచిన ఓడిన గ్రామంలో అందరు సమానమేనని పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధికి కొత్త పాలకవర్గం కృషి చేయాలని ఆయన అన్నారు.ప్రతి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులందరూ గ్రామాభివృద్ధి కోసం పెద్ద జీతగాడిలా పనిచేసే అభివృద్ధి సాధించాలని ఆయన సూచించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి టీంలో విజయం సాధించిన తొలి సర్పంచ్లు మీరని ప్రభుత్వానికి ఎక్కడ చెడ్డపేరు రాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.నెల రోజుల్లో గ్రామాలలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి గ్రామాలను అద్దంలో తీర్చిదిద్దాలని సర్పంచ్లకు ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భం గా ఆయనఖిల్లా ఘణపురం... మండలం లోని.రోడ్డుమీద తండా, ఖిల్లా ఘణపురం సోలిపురం,పెద్దమందడి మండలం. వీరాయపల్లి, పామిరెడ్డిపల్లి, చిన్న మందడి, పెద్దమందడి. పెబ్బేరు మండలం. తోమాలపల్లి, శాఖాపురం గ్రామాలలో నిర్వహించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాలకు కావలసిన నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేస్తుందన్నారు.పెద్ద ఎత్తున అవసరమయ్యే పనులకు ఎమ్మెల్యే నిధుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధుల నుంచి నిధులు రాబట్టి అభివృద్ధి చేసుకుందామని సర్పంచులు గ్రామాలలో మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఆయన సూచించారు. ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పుస్తకాలతో ప్రజాస్వామ్యానికి ప్రాణం


## 8వ పుస్తక ప్రదర్శనలో సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాసరెడ్డి




**జగిత్యాల :** హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 38వ పుస్తక ప్రదర్శన (బుక్ ఫెయిర్)లో జగిత్యాల జిల్లా సీనియర్ పాత్రికేయులు కాలగిరి శ్రీనివాసరెడ్డి పాల్గొని పుస్తకాల ప్రపంచాన్ని ఆసక్తిగా తిలకించారు. వివిధ ప్రచురణ సంస్థలు, రచయితలు, పాఠకులతో కళకళలాడుతున్న ఈ ప్రదర్శనలో విభిన్న అంశాలకు సంబంధించిన వేలాది పుస్తకాలు అందుబాటులో ఉండటం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న పలువురు సీనియర్ పాత్రికేయులు, రచయితలను శ్రీనివాసరెడ్డి ఆత్మీయంగా కలుసుకుని అభిప్రాయాలు పంచుకున్నారు. పుస్తక ప్రదర్శన వేదికలు కేవలం పుస్తకాల విక్రయ కేంద్రాలే కాకుండా, ఆలోచనల మార్పిడికి, మేధో చర్చలకు కేంద్రబిందువులని ఆయన పేర్కొన్నారు.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, "పుస్తకం మనిషిని ఆలోచింపజేస్తుంది, సమాజాన్ని ప్రశ్నించడానికి ధైర్యం ఇస్తుంది. పుస్తక పఠనం తగ్గిపోతే ప్రజాస్వామ్య వ్యవస్థలో మేధస్సు కొరత ఏర్పడే ప్రమాదం ఉంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలంగా నిలబెట్టాలంటే పుస్తక సంస్కృతి విస్తరించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.నేటి తరానికి పుస్తక పఠనాన్ని ఒక అభిరుచిగా, అలవాటుగా మార్చాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. "ఈ తరం పిల్లలు, యువత ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్నారు. కానీ పుస్తకాన్ని తమ జీవితంలో భాగం చేసుకోవడం తగ్గుతోంది. ఇది శుభ పరిణామం కాదు. పుస్తకం చేతిలో ఉంటే ఆలోచనలకు దిశ దొరుకుతుంది" అని పేర్కొన్నారు.పుస్తక పఠన సంస్కృతి నిలబడాలంటే కేవలం వ్యక్తిగత ప్రయత్నాలు సరిపోవని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యతను స్వీకరించాలి అని శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా సూచించారు. గ్రామస్థాయిలో గ్రంథాలయాలు ఏర్పాటైతే పిల్లలు, యువత చిన్న వయసులోనే పుస్తకాలతో స్నేహం పెంచుకుంటారని, అది వారి ఆలోచనా శక్తిని, సామాజిక స్పృహను మరింత పెంపొందిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో అనుసంధానంగా గ్రామ గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తే, చదువు కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా జీవన విలువలను నేర్పే సాధనగా మారుతుందని అభిప్రాయపడ్డారు. డిజిటల్ యుగంలోనూ పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదని, ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండటం ప్రజాస్వామ్యానికి మేధో పునాది అవుతుందని ఆయన స్పష్టం చేశారు.ప్రతి ఇంట్లో ఒక చిన్న గ్రంథాలయం ఉండాలన్న ఆలోచనను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, పుస్తక పట్టణాలుగా మారిన సమాజాలే నిజమైన అభివృద్ధిని సాధించగలవని ఆయన పేర్కొన్నారు. పుస్తక ప్రదర్శనల వంటి కార్యక్రమాలు పాఠకులను మళ్లీ పుస్తకాల వైపు మళ్లించే శక్తివంతమైన వేదికలని కొనియాడారు. పాత్రికేయుడిగా, విశ్లేషకుడిగా సుదీర్ఘ అనుభవం కలిగిన కాలగిరి శ్రీనివాసరెడ్డి పుస్తకాలపై వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాలు, పాఠకుల్లో మళ్లీ చదువుపై ఆసక్తిని పెంచడమే కాకుండా, మేధోసంపన్న సమాజ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## సీపీఆర్ చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ హోం గార్డు

### అభినందించి రివార్డు అందజేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి స్పృహ కోల్పోగా, అతనికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ హోం గార్డు చంద్రశేఖర్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శాలువతో సన్మానించి రివార్డును అందజేశారు.వివరాల్లోకి వెళ్తే జగిత్యాల కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద ఆగి ఉన్న ఆటో వద్ద నిలబడి ఉన్న రఫీ వయస్సు 60 సంవత్సరాలు గల వృద్ధుడిని ఒక ద్విచక్రవాహనం వచ్చి ఢీకొట్టడం జరిగింది.ఈ ప్రమాదం జరిగిన వెంటనే రఫీ స్పృహ కోల్పోయాడు. కాగా, అక్కడే డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ హోమ్ గార్డ్ చంద్రశేఖర్ గమనించి రఫీకి సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడారు. అనంతరం రఫీ యొక్క కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అతడిని అంబులెన్స్ లో ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిపిఆర్ మరియు ప్రథమ చికిత్సలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం ద్వారా నేర్చుకున్న విషయాలు పోలీస్ అధికారులకు మరియు సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, ఒక మనిషి ప్రాణాన్ని కాపాడడం ద్వారా ఇలాంటి కార్యక్రమాలు ఆవశ్యకతను మరింత తెలియజేస్తున్నాయని ఎస్పి గారు అన్నారు. సిపిఆర్ ద్వారా ప్రాణాలు కాపాడిన హోం గార్డ్ చంద్రశేఖర్ ను జిల్లా ఎస్పీ శాలువతో సన్మానించి రివార్డును అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

## బాలెంల గ్రామ సర్పంచిగా నూతనంగా ఎన్నికైన గాలి మమత నాగేష్



**ధర్మఘంట, డిసెంబర్ 22, సూర్యాపేట:**
మండల కేంద్రంలోని బాలెంల గ్రామంలో సర్పంచ్ వార్డు సభ్యులు సోమవారం నాడు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ ప్రజాప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు గాలి మమత నాగేష్ పై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీటి సరఫరా, విద్య, ఆరోగ్య సేవల వంటి ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేయాలని తెలిపారు. బాలెంల గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. నూతన సర్పంచిగా బాధ్యతలు స్వీకరించిన గాలి మమత నాగేష్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, బాలెంల గ్రామం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## గ్రామ అభివృద్ధి కోసం పని చేస్తాను

**టేకుమట్ల గ్రామ సర్పంచ్ గా పదవి ప్రమాణ స్వీకారం చేసిన గట్టు జ్యోతి శ్రీనివాస్**




**ధర్మఘంట, డిసెంబర్ 22, సూర్యాపేట:**
మండల కేంద్రంలోని టేకుమట్ల గ్రామ పంచాయతి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధికి నిధులు తీసుకుని వస్తానని టేకుమట్ల గ్రామ సర్పంచ్ గట్టు జ్యోతి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నాడు గ్రామపంచాయతీ కార్యాలయం నందు నూతనంగా సర్పంచ్ గా ఎన్నికైన గట్టు జ్యోతి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గా దిండిగాల శివాజి, వార్డు మెంబర్ లుగా నీరుడు సురేష్, చేతరాజుపల్లి వీరయ్య, చింతమల్ల వేణు ప్రతాప్, చింతపల్లి శిరీష, బొడ్డు జానకి దాసరి శ్రీనివాస్, సూరారపు పూలమ్మ, కాంపాటి రమేష్, దుర్గం యాదయ్య, చింతలచేరి శ్రీనివాస్, కల్లెపల్లి మహేశ్వరిలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎంపిడివో బాల కిషన్, పంచాయతి కార్యదర్శి దళవాయి నరసింహారావు , సూర్యాపేట మార్కెట్ కమిటీ మాజి చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, నిమ్మల వెంకన్న, నేరెళ్ళ మధు, గ్రామ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఢిల్లీ హైకోర్టులో పవన్, ఎన్టీఆర్ వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై విచారణ.. కీలక ఆదేశాలు జారీ

**హైదరాబాద్ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టాలీవుడ్ అగ్రహీరో ఎన్టీఆర్ దాఖలు చేసిన వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు ఈ రోజు విచారణ చేపట్టింది. సోషల్ మీడియాలో తమ ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య ప్రకటనల కోసం వినియోగించడం, తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం కలుగుతోందని పవన్, తారక్ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. వీరిద్దరి తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ వాదనలు వినిపించారు. మార్ఫింగ్ ఫొటోలు, అవమానకర పోస్టులు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసుల్లో అమెజాన్, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే కొన్ని లింకులను తొలగించినట్లు ప్రతివాదులు కోర్టుకు వివరించారు. అయితే, తొలగించిన లింకులపై ఆదేశాలు జారీ చేయడానికి ముందు సంబంధిత ఖాతాదారులకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని న్యాయస్థానం పేర్కొంది.గూగుల్ తమ వినియోగదారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని లేదా ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది. సంబంధిత బీఎస్ఐ, ఐపీ లాగిన్ వివరాలను మూడు వారాల్లోగా అందించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే, తదుపరి విచారణను మే 12వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది.

## బీఆర్ఎస్. బీజేపీలు కలిసి పనిచేశాయి

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై మంత్రి జూపల్లి కృష్ణారావు సెటైర్లు వేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఎదురుదెబ్బ తగిలిందని... పార్టీ బలహీనమయిందని గ్రహించే కేసీఆర్ ఫామ్ హౌస్ ను వదిలి ఇప్పుడు బయటకు వచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల పాలనకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రిఫరెండం అని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేశాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పాలనపై కేసీఆర్, కేటీఆర్ చేసిన ఆరోపణలు తప్పు అంటూ ప్రజలు తీర్పును వెలువరించారని చెప్పారు. కేసీఆర్ బయటకు వచ్చింది ప్రాజెక్టుల కోసం కాదని... పార్టీని కాపాడుకోవడం కోసమేనని అన్నారు. ఎన్నికలు జరిగిన రెండేళ్ల తర్వాత బయటకు వచ్చిన కేసీఆర్... వచ్చీ రాగానే తోలు తీస్తానని అంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి తోలు మాత్రమే మిగిలిందని, కండలు కరిగిపోయాయని అన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చిందని దుయ్యబట్టారు. ఆ అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలను అమలు చేయడం తమ ప్రభుత్వ సమర్థత అని చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని పూర్తి చేస్తానని చెప్పిన కేసీఆర్... పదేళ్ల పాలనలో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. రూ. 8 లక్షల కోట్ల అప్పు చేసినా ఒక ఎకరాకు కూడా కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు తాగునీటి ప్రాజెక్టు అంటూ సుప్రీంకోర్టులో కేసు వేసిన కేసీఆర్...

## బిజినెస్

# జాతీయ పింఛను పథకం కొత్త రూల్స్..
# నిబంధనల్లో కీలక మార్పులు




జాతీయ పింఛన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్) నిబంధనల్లో కీలక మార్పులు వచ్చాయి. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ సవరణలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. యాన్యుటీ లిమిట్ 20 శాతానికి కుదించడం సహా 85 ఏళ్ల వయసు వచ్చే వరకు ఎన్‌పీఎస్ స్కీమ్‌లో కొనసాగేందుకు అనుమతించారు. కనీసం ఆరేళ్ల పాటు సిస్టమిక్ యూనిట్ రిడంప్షన్‌ను అనుమతించారు. ఎన్‌పీఎస్ చందాదారులు ఇప్పటి వరకు 75 ఏళ్ల గరిష్ఠ వయసు వరకే కొనసాగేందుకు అనుమతి ఉండేది. ఇప్పుడు ఈ వయో పరిమితిని 85 ఏళ్లకు పెంచారు. ఈ వయసు తర్వాత తమ అకౌంట్లోని మొత్తాన్ని ఒకేసారి లేదా దశల వారీగా విత్ డ్రా చేసుకోవచ్చు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకూ వర్తిస్తుంది. రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక స్థిరత్వం ఉన్న ఎన్‌పీఎస్ చందాదారులకు లబ్ధిచేకూర్చుతుంది. గతంలో ప్రభుత్వేతర ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత లేదా ఇతర ప్రత్యేక సందర్భాల్లో తమ అకౌంట్లలో జమైన రూ.5 లక్షలకు మించి ఉంటే.. అందులో 40 శాతం యాన్యుటీల కొనుగోలుకు ఖర్చు చేయాల్సి ఉండేది. కానీ ఇప్పుడు దానిని 20 శాతానికి తగ్గించారు. కొత్త నిబంధనల ప్రకారం.. ప్రత్యేక సందర్భాల్లో 100 శాతం మొత్తాన్ని ఒకేసారి విత్ డ్రా చేసుకోవచ్చు. రిటైర్మెంట్ నాటికి ఎన్‌పీఎస్ అకౌంట్లో పోగైన రూ.8 లక్షలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే మాత్రం ఇది వర్తిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులైతే మొత్తంలో కనీసం 40 శాతంతో, ప్రైవేట్ ఉద్యోగులైతే 20 శాతం కనీస మొత్తంతో యాన్యుటీ కొనాల్సి ఉంటుంది. ఎన్‌పీఎస్ చందాదారులు రిటైరయ్యేలోపు అంటే లేదా సూపర్‌యాన్యుయేషన్ లోపు 4 విడతల వరకు తమ ఎన్‌పీఎస్ అకౌంట్ నుంచి విత్ డ్రా చేయవచ్చు. అయితే ఇందు కోసం ఒక విత్ డ్రాయల్‌కు మరో విత్ డ్రాయల్‌కు మధ్య కనీసం నాలుగు సంవత్సరాల వ్యవధి ఉండాల్సి ఉంటుంది. ఇంతకు ముందు ఇది మూడు సంవత్సరాలుగా ఉండేది. పదవీ విరమణ లేదా 60 ఏళ్ల తర్వాత కొంత మంది పింఛను పథకంలో కొనసాగుతారు. వీరు కూడా మూడేళ్లకోసారి తమ చందా మొత్తం నుంచి 25 శాతం విత్ డ్రా చేయవచ్చు. ఎన్‌పీఎస్ చందాదారులు భారత పౌరసత్వం వదులుకుంటే ఆ వ్యక్తి తన ఖాతా క్లోజ్ చేసుకోవచ్చు. అప్పటి వరకు అకౌంట్లో జమైన మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తారు. కనిపించకుండా పోయిన లేదా చనిపోయారని భావించే వ్యక్తుల విషయంలో వ్యక్తుల నామినీలు లేదా చట్టబద్ధ వారసులకు 20 శాతాన్ని ఒకేసారి చెల్లిస్తారు. ప్రతి ఎన్‌పీఎస్ ఖాతాకు శాశ్వత రిటైర్మెంట్ ఖాతా (పీఆర్ఏ) పేరుతో ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఎన్‌పీఎస్ అకౌంట్లో రిటైరయ్యే నాటికి రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు జమ అయితే విత్ డ్రాయల్స్ కోసం కొత్త శ్లాబులు తీసుకొచ్చారు. మొదటి ఆప్షన్ ప్రకారం ఒకేసారి రూ.6 లక్షల వరకు విత్ డ్రా చేసుకోవచ్చు. ఆప్షన్ 2 ప్రకారం ఒకేసారి రూ.6 లక్షల వరకు వెనక్కి తీసుకుని మిగతా మొత్తంతో యాన్యుటీలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఆప్షన్ 3 ప్రకారం రిటైర్మెంట్ ఖాతాలో 60 శాతం ఒకేసారి పన్నులు లేకుండా వెనక్కి తీసుకోవచ్చు.

### 700 బిలియన్ డాలర్ల కుబేరుడిగా ఎలన్ మస్క్ రికార్డులు



ప్రపంచ బిలియనీర్ కొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. ఇటీవలే ప్రపంచంలో 600 బిలియన్ డాలర్ల సంపద కలిగిన వ్యక్తిగా నిలిచిన మస్క్, తాజాగా మరో చరిత్ర సృష్టించారు. 2018లో టెస్లా మస్క్‌కు ప్రకటించిన 55 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీ విషయంలో డెలావేర్ సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఈ ఘనతను సాధించారు. దీంతో టెస్లా సీఈఓ చరిత్రలోనే 700 బిలియన్ డాలర్లకు పైగా సంపద ఉన్న తొలి వ్యక్తి అయ్యారు. మన కరెన్సీలో దీన్ని లెక్కిస్తే రూ. 62.70 లక్షల కోట్లు. టెస్లా కంపెనీ వృద్ధిలో కీలకంగా నిలిచినందుకు కంపెనీ బోర్డు నిర్ణయించింది. కానీ, ఈ స్థాయి ప్యాకేజీపై ఓ వాటాదారు అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో డెలావేర్ కోర్టే అనుమతుల్లో నిబంధనలు పాటించలేదని అభిప్రాయపడింది. దీన్ని రద్దు చేస్తున్నట్టు 2024లో కింది కోర్టు తీర్పు ఇచ్చింది. దీన్ని పునరుద్ధరించాలని తాజాగా డెలావేర్ కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం ఫోర్బ్స్ బిలియనీర్ల సూచీలో టెస్లా స్టాక్ ఆప్షన్లను పునరుద్ధరించడంతో ఎలన్ మస్క్ సంపదను 749 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. ప్యాకేజీ పునరుద్ధరణ వల్ల ఎలన్ మస్క్ సంపదలో కొత్తగా 139 బిలియన్ డాలర్లు చేరాయి.

### 10-12 శాతం పెరగనున్న ఏఐ, డేటా ఇంజనీర్ల జీతాలు



వచ్చే ఏడాది ఏఐ స్కిల్స్ ఉన్న వారికి భారీ వేతనాలు ఉండనున్నాయని ఓ నివేదిక తెలిపింది. ముఖ్యంగా ఏఐ బూమ్ మధ్య ఏఐ స్కిల్స్ ఉండే ప్రొఫెషనల్స్, డేటా ఇంజనీర్లు, సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్స్‌కు అధిక డిమాండ్ ఉంది. 2026 ఏడాదికి వారంతా తమ వేతనాల్లో 10-12 శాతం వృద్ధిని చూస్తారని పలు స్టాఫింగ్ కంపెనీలు వెల్లడించాయి. ఐటీ సేవల కంపెనీలు, స్టార్టప్‌లు ఏఐ-ఆధారిత వృద్ధికి ఎక్కువ దృష్టి సారిస్తున్నాయి. అందుకే ఏఐ స్కిల్స్ వారిని కాపాడుకునేందుకు, కొత్త వారిని తీసుకునేందుకు ఎక్కువ ఖర్చు చేస్తాయని, జీతాలూ పెంచుతాయని కంపెనీలు స్పష్టం చేశాయి. ప్రస్తుతం ప్రత్యేక స్కిల్స్ ఉన్న ఉద్యోగులు ఏడాదికి రూ. 30-38 లక్షల మేర జీతం తీసుకుంటున్నారు. కొంతమంది ఏఐ ఇంజనీర్లు, సైంటిస్టులు రూ. 60 లక్షల వరకు కూడా తీసుకుంటున్నారు. వచ్చే ఏడాది వివిధ రంగాలలో జీతాల పెరుగుదల మితంగా ఉన్నప్పటికీ, ప్రత్యేక స్కిల్స్ ఉన్న ఉద్యోగులు వేతన ప్యాకేజీలలో గణనీయమైన పెరుగుదలను చూసే అవకాశం ఉంది. ఇదే సమయంలో కొన్ని రంగాలు సగటు కంటే ఎక్కువ పెరుగుదలను చూస్తారు. క్లీన్ ఎనర్జీ, సెమీకండక్టర్, ఎన్‌బీఎఫ్‌సీలు, రక్షణ అండ్ ఏరోస్పేస్, ఎఫ్‌ఎంసీజీ, జీసీసీలు ఎక్కువ పెట్టుబడులు, డిజిటల్ అప్‌గ్రేడ్ వల్ల అధిక జీతం ఆఫర్ చేస్తాయని స్టాఫింగ్ కంపెనీలు పేర్కొన్నాయి.

# కొత్త ఏడాదిలో సొంతింటి కల భారమే..

నూతన ఏడాదిలో సొంత ఇల్లు కొనుగోలు చేయాలని భావిస్తున్న మధ్యతరగతి ప్రజలకు రియల్ ఎస్టేట్ రంగం నుండి చేదు వార్త అందుతోంది. దేశవ్యాప్తంగా గృహాలకు పెరిగిన విపరీతమైన డిమాండ్ కారణంగా, వచ్చే ఏడాది ఇళ్ల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని తాజాగా వెల్లడైన క్రెడాయ్ మ్యాట్రిక్స్ సర్వే స్పష్టం చేసింది. దాదాపు 68 శాతం మంది రియల్ ఎస్టేట్ డెవలపర్లు ధరల పెరుగుదల తప్పనిసరని అభిప్రాయపడుతున్నారు, ఇది సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. ధరల పెరుగుదల ఏ స్థాయిలో ఉంటుందనే అంశంపై సర్వేలో ఆసక్తికరమైన గణాంకాలు వెల్లడయ్యాయి. సుమారు 46 శాతం మంది బిల్డర్లు ధరలు 10 శాతం వరకు పెరగొచ్చని అంచనా వేయగా, మరో 18 శాతం మంది డెవలపర్లు ఏకంగా 10 నుంచి 15 శాతం వరకు పెరుగుదల ఉంటుందని పేర్కొన్నారు. నిర్మాణ సామాగ్రి ధరలు పెరగడం మరియు ప్రీమియం ప్రాజెక్టులకు ఆదరణ పెరగడం వల్ల ఈ వ్యత్యాసం కనిపిస్తోందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనివల్ల నగరాల్లో కొత్త ప్రాజెక్టుల ప్రారంభ ధరలే సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ పెరుగుతున్న



వ్యయాన్ని అరికట్టేందుకు డెవలపర్లు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. నిర్మాణ రంగంలో అత్యాధునిక టెక్నాలజీని ప్రవేశపెట్టడం ద్వారా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి, తద్వారా ఖర్చులను నియంత్రించాలని భావిస్తున్నట్లు క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్ తెలిపారు. టెక్నాలజీ వినియోగం వల్ల వృథాను అరికట్టవచ్చని, అయితే మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా ధరల పెంపు అనేది అనివార్యమని ఆయన వివరించారు. ఈ పరిణామాలు గృహ కొనుగోలుదారుల్లో కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. మరోవైపు, పెరుగుతున్న వడ్డీ రేట్లు మరియు భూముల ధరలు కూడా ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి ప్రాంతాల్లో ఇన్వెంటరీ తక్కువగా ఉండటం వల్ల డిమాండ్ మించిపోయింది. రాబోయే పండుగ సీజన్లలో కొత్త లాంచ్‌లు భారీగా ఉన్నప్పటికీ, ధరల పెరుగుదల కారణంగా అమ్మకాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందోనని రియల్ ఎస్టేట్ వర్గాలు వేచి చూస్తున్నాయి. సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే వారు ఇప్పుడే నిర్ణయం తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

## స్పోర్ట్స్

# యంగ్ ఇండియాకు ఏమైంది..
# తుది సమరాల్లో ఏమిటీ తడబాటు?



డిసెంబర్ 21న జరిగిన అండర్-19 ఆసియా కప్ 2025 ఫైనల్లో యంగ్ ఇండియా పాకిస్తాన్ చేతిలో 191 పరుగుల భారీ తేడాతో పరాజయంపాలై, భారత క్రికెట్ అభిమానులకు తీవ్ర నిరాశ కలిగించింది. ఈ టోర్నీ ఫైనల్ వరకు అజేయ జట్టుగా నిలిచిన భారత్.. తుది మెట్టుపై బోల్తా పడటాన్ని, అందులోనూ పాక్ చేతిలో ఓడిపోవడాన్ని సగటు భారతీయుడు జీర్ణించుకోలేకపోతున్నాడు. అంతవరకు తిరుగులేని శక్తిగా కనిపించిన భారత్.. అమీతుమీ పోరులో ఎందుకలా చతికిలబడిందని అంతా లెక్కలేసుకుంటున్నారు. కారణాలు ఏంటని విశ్లేషిస్తే.. ఒత్తిడే ప్రధాన కారణంగా తెలుస్తుంది. అయినా యువ భారత జట్టుకు ఆసియా కప్ ఫైనల్లో ఒత్తిడికి చిత్తవడం ఇది కొత్తేమీ కాదు. గత ఎడిషన్ ఫైనల్లోనూ బంగ్లాదేశ్ చేతిలో ఇలానే చిత్తైంది. స్టార్ ప్లేయర్లకు ఏమాత్రం తీసిపోని టాలెంట్ ఉన్న ఆటగాళ్లు ఉన్నా.. ఎందుకో యంగ్ ఇండియాకు ఫైనల్ ఫోబియా పట్టుకుంది. ఒత్తిడి మినహా కారణాలేమీ కనబడటం లేదు. ఎందుకంత ఒత్తిడా అన్ని పరిశీలిస్తే.. తాజా ఉదంతంలో (2025 ఎడిషన్ ఫైనల్లో) భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకొని భారీ స్కోర్ సమర్పించుకోవడం కారణంగా తెలుస్తుంది. అలాగని బౌలింగ్ విభాగం బాగా లేదా అని చూస్తే అదీ లేదు. హెనిల్ పటేల్, దీపేశ్ దేవేంద్రన్ లాంటి సీనియర్ స్థాయి మీడియం పేసర్లు.. కనిష్క్ చౌహాన్, ఖిలన్ పటేల్ లాంటి నాణ్యమైన స్పిన్నర్లు జట్టులో ఉన్నారు. పిచ్ నుంచి సరైన సహకారం లభించకపోవడం భారత్ భారీ స్కోర్ సమర్పించుకోవడానికి కారణమని తెలుస్తుంది. భారత కెప్టెన్ ఆయుశ్ మాత్రే టాస్ గెలిచినా పిచ్‌ను అంచనా వేయడంలో విఫలమయ్యాడని టాక్ వినిపిస్తుంది. ఇదే భారత్ కొంపముంచిదని అనిపిస్తుంది. పిచ్ నుంచి సహకారం లభించకపోయినా భారత బౌలర్లు చివరి ఓవర్లలో పుంజుకున్నారు. ఓ దశలో పాక్ 400 స్కోర్ దాటేలా కనిపించినా 347 పరుగులకే పరిమితం చేయగలిగారు. భారీ లక్ష్య ఛేదనను సైతం భారత్ ఆత్మవిశ్వాసంతోనే ప్రారంభించింది. తొలి బంతినే చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ సిక్సర్‌గా మలిచి పాక్ శిబిరంలో ఆందోళన రేకెత్తించాడు. ఇక్కడే పాక్ బౌలర్లు మైండ్ గేమ్ మొదలుపెట్టారు. భారత బ్యాటర్లను, ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీని బంతితో కట్టడి చేయలేమని తెలిసి నోటికి పని చెప్పారు. పదేపదే కెప్టెన్ ఆయుశ్ మాత్రే, వైభవ్ సూర్యవంశీని మాటలతో, దురుసు ప్రవర్తనతో రెచ్చగొట్టారు. దీంతో ఏకాగ్రత కోల్పోయిన యంగ్ ఇండియా బ్యాటర్లు వరుస పెట్టి వికెట్లు పారేసుకొని పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత ఓటమి తొలి 10 ఓవర్లలోనే ఖరారైపోయింది. టాప్-5 ప్లేయర్లు 9.4 ఓవర్లలో 68 పరుగులకే ఔటైపోయారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ఏదో ఆడాలని ఆడటంతో భారత్ 150 పరుగుల మార్కునైనా దాటగలిగింది.

మొత్తంగా చూస్తే.. నిన్నటి రోజున భారత్‌కు ఏదీ కలిసి రాలేదు. పిచ్‌ను అంచనా వేయడం నుంచి పాక్ ఆటగాళ్ల స్లెడ్జింగ్ వలలో పడటం, అలాగే ఒత్తిడి లోనవడం వంటివి జరిగిపోయాయి. ఈ టోర్నీలో అరివీర భయంకరమైన ఫామ్‌లో ఉండిన వైభవ్ సూర్యవంశీ, అభిగ్యాన్ కుందు అంతిమ పోరులో సత్తా చాటలేకపోవడం భారత ఓటమికి మరో కారణం. గ్రూప్ దశలో పాకిస్తాన్‌ను చిత్తు చేసిన యంగ్ ఇండియా అదే విశ్వాసాన్ని తుది సమరంలో కొనసాగించలేకపోవడం ఇంకో కారణం. అంతిమంగా భారత్ అన్ని విధాల అర్హమైన ఆసియా కప్ టైటిల్‌ను కోల్పోవాల్సి వచ్చింది. వరుసగా రెండు ఎడిషన్లలో ఫైనల్స్ వరకు వచ్చి ఓడిపోవడం భారత క్రికెట్ అభిమానులకు చాలా బాధ కలిగిస్తుంది. ఈ టోర్నీ చరిత్ర చూస్తే.. భారత్ అత్యంత విజయవంతమైన జట్టుగా ఉంది. ఇప్పటివరకు 12 ఎడిషన్లు జరగ్గా భారత్ 8 సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. చివరిగా 2021 ఎడిషన్‌లో టైటిల్ సాధించింది. ఆ ఎడిషన్ ఫైనల్లో శ్రీలంకను చిత్తుగా ఓడించి ఆసియా ఛాంపియన్‌గా అవతరించింది.

### ఇంగ్లండ్ ఓడినా.. 'ఆసీస్' చెత్త జట్టు.. ఇప్పటికీ అదే మాట అంటాను!



ఇంగ్లండ్‌కు మరోసారి ఘోర పరాభవం ఎదురైంది. ప్రతిష్టాత్మకదయాషెస్ సిరీస్‌ను వరుసగా రెండోసారి ఆస్ట్రేలియాకు కోల్పోయింది. సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన కంగారూలు... మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను చేజిక్కించుకున్నారు. దీంతో ఇంగ్లండ్ బిక్కముఖం వేయాల్సి వచ్చింది.

**సంపూర్ణ ఆధిపత్యం**

ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లలో ఇంగ్లండ్‌పై సంపూర్ణ ఆధిపత్యంతో గెలిచిన ఆసీస్.. మూడో టెస్టులోనూ దుమ్ములేపింది. అడిలైడ్ వేదికగా ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆసీస్ 82 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. ఆసీస్ విధించిన 435 పరుగుల విజయలక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 207/6తో చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్... చివరకు 102.5 ఓవర్లలో 352 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇక 2011 నుంచి సొంతగడ్డపై 'యాషెస్' సిరీస్ కోల్పోని కంగారూలు... ఈసారి కూడా పూర్తి ఆధిపత్యం కనబర్చగా... అప్పటి నుంచి కనీసం ఒక్క మ్యాచ్‌లో అయినా విజయం సాధించాలనుకుంటున్న ఇంగ్లండ్ జట్టుకు మరోసారి నిరాశ తప్పలేదు.

**చెలరేగిన బౌలర్లు**

ఇంగ్లండ్ వికెట్ కీపర్ బ్యాటర్ జేమీ స్మిత్ (83 బంతుల్లో 60; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాస్త పోరాడగా... అతడికి విల్ జాక్స్ (137 బంతుల్లో 47; 3 ఫోర్లు), బ్రైడన్ కార్స్(64 బంతుల్లో 39 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) సహకరించారు.

### స్నికోమీటర్ చిరాకు తెప్పిస్తోంది.. డీఆర్ఎస్ లోపాల్ని వెంటనే సరిచేయండి!




ఈమధ్య కాలంలో డీఆర్ఎస్ వ్యవస్థపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా యాషెస్ సిరీస్ మూడో టెస్టులోనూ డీఆర్ఎస్‌లోని స్నికోమీటర్ లోపాలు స్పష్టంగా కనిపించాయి. అడిలైడ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ రెండు సందర్భాల్లో అంపైర్ నిర్ణయాన్ని సవాల్ చేయగా ఆతిథ్య జట్టుకే అనుకూలంగా నిర్ణయం వచ్చింది. దాంతో.. ఇంగ్లండ్ ఆటగాళ్లు అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ ఐసీసీకి కీలక విజ్ఞప్తి చేశాడు. డీఆర్ఎస్ వ్యవస్థలోని లోపాలను సరి చేయాలని అంతర్జాతీయ క్రికెట్ మండలిని కోరాడు. 'డిసిషన్ రివ్యూ సిస్టమ్ అనేది లోపభూయిష్టంగా ఉంది. ప్రేక్షకులకు, అధికారులకు, బ్రాడ్‌కాస్టర్లకు ఈ నియమం చిరాకు తెప్పిస్తోంది. డీఆర్ఎస్‌పై నా అభిప్రాయం చెప్పదలచుకున్నాను. ఈ వ్యవస్థను మ్యాచ్ అధికారులు ఉపయోగిస్తారు. అలాంటప్పుడు ఐసీసీ ఎందుకు డబ్బులు చెల్లించాలి. అన్ని బోర్డులకు ఒక్కరే ఈ సిస్టమ్‌ను ఎందుకు అందించడం లేదు. ఐసీసీ టోర్నీలతో పాటు అన్ని సిరీస్‌లకు ఒకేరకమైన సాంకేతికతను ఎందుకు ఉపయోగించడం లేదు. ఒకవేళ అన్నింటా ఒకే టెక్నాలజీ ఉపయోగిస్తే గందరగోళం తగ్గుతుంది. అంతేకాదు ఎవరికీ చిరాకు పడరు అని ఐసీసీకి స్టార్క్ విన్నవించాడు. ఏకీకృత వ్యవస్థను తీసుకురావాలని సూచించాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇకనైనా ఐసీసీ ఉత్తమమైన డీఆర్ఎస్ వ్యవస్థను తీసుకురావాలి' అని వాన్ సూచించాడు.

**అసలేం జరిగిందంటే..**

తొలి ఇన్నింగ్స్‌లో అలెక్స్ క్యారీని అంపైర్ ఔటిచ్చాడు. అయితే.. రివ్యూ తీసుకొని బతికిపోయిన ఆసీస్ వికెట్ కీపర్ ఏకంగా సెంచరీతో జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లోనూ డీఆర్ఎస్ నిర్ణయం ఆసీస్‌కు అనుకూలంగా వచ్చింది. బ్యాట్, బంతి మధ్య దూరం ఉన్నట్టు కనిపిస్తున్నా సరే స్నికోమీటర్ మాత్రం బంతి ఎడ్జ్ తీసుకున్నట్టు చూపించింది. దాంతో.. ఇంగ్లండ్ బ్యాటర్ నిరాశగా పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో 81 పరుగుల తేడాతో గెలుపొందిన ఆతిథ్య జట్టు 3-0తో సిరీస్ పట్టేసింది.




## ఫన్నీగా శర్వానంద్ కొత్త మూవీ టీజర్

గత కొన్నేళ్లుగా సరైన హిట్ అనేదే లేక ఇబ్బంది పడుతున్న తెలుగు హీరో శర్వానంద్.. ల్యాంగ్ గ్యాప్ తర్వాత ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. 'నారీ నారీ నడుమ మురారి' పేరుతో తీసిన సినిమా.. సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలోకి రానుంది. తాజాగా టీజర్ రిలీజ్ చేసి ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో శర్వా సరసన సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించారు. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకుడు. అనిల్ సుంకర నిర్మించారు. టీజర్ చూస్తుంటే కామెడీ బాగానే ఉంది. విజువల్స్, మ్యూజిక్ కూడా ఆకట్టుకునేలా అనిపించాయి. కాకపోతే సంయుక్త, నరేశ్, సునీల్ డబ్బింగ్ ఏదో తేడాగా అనిపించింది. ఆఫీస్‌లో ఓ అమ్మాయిని ప్రేమించిన హీరో, హీరోయిన్‌తో పెళ్లికి సిద్ధమవుతాడు. కానీ ఇతడి టీమ్ లీడర్‌గా మరో హీరోయిన్ వస్తుంది. ఈమెకి హీరోకి గతంలో లవ్ స్టోరీ ఉంటుంది. మరి ఇద్దరు హీరోయిన్లలో హీరో ఎవరిని పెళ్లి చేసుకున్నాడనేదే స్టోరీలా అనిపిస్తుంది. సంక్రాంతి బరిలో దీనితో పాటు చాలా సినిమాలు ఉన్నాయి. జనవరి 9న ప్రభాస్ 'రాజాసాబ్' రానుంది. ఇదే రోజున తమిళ డబ్బింగ్ మూవీ 'జననాయగణ్' పోటీలో ఉంది. 10వ తేదీన మరో తమిళ డబ్బింగ్ సినిమా 'పరాశక్తి' విడుదల కానుంది. 12వ తేదీన 'చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు', 13న రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 14న నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' రిలీజ్ కానున్నాయి. మరి వీటితో పోటీపడి శర్వా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాడో చూడాలి?

## అగ్రెసివ్‌గా రష్మిక మందన్నా.. మైసా ఫస్ట్ గ్లింప్స్ వచ్చేస్తుంది




కన్నడ భామ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ మైసా పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. రష్మిక మందన్నా ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో కనిపించనున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. తాజాగా మరో క్రేజీ వార్తను షేర్ చేశారు. మైసా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని పోస్టర్లతో తెలుస్తోంది. మైసా సినిమాతో ఘుఞఅనతీఞ్రాబశ్రీశ్రీవ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ప్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో పాన్ ఇండియా మార్కెట్‌ను షేక్ చేసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా ఎలా మెప్పించబోతున్నదన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తుండగా.. కల్కి 2898 ఏడీ చిత్రానికి పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. కేరళలోని అథిరప్పిల్లీలో షూటింగ్ షురూ అయినట్టు ఇప్పటికే మేకర్స్ అప్‌డేట్ అందించారు.

# ప్రభాస్ సలార్ మేనియాకు రెండేళ్లు..

### సీక్వెల్ కోసం వెయిటింగ్ ఇక్కడ!

బాహుబలి ప్రాంచైజీ తర్వాత ప్రభాస్ కెరీర్‌లోవన్ ఆఫ్ ది బెస్ట్ యాక్షన్ థ్రిల్లర్‌గా నిలిచే చిత్రం సలార్ కేజీఎఫ్ ఫేం డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన ఈ మూవీ ప్రాంచైజీగా వస్తున్న విషయం తెలిసిందే. 2023 డిసెంబర్ 22న థియేటర్లలో విడుదలైన బాక్సాఫీస్ వద్ద నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. మరోవైపు సలార్ ఓటీటీ ప్లాట్‌ఫాంలో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. కాగా సలార్ మేనియా మొదలై నేటితో రెండేళ్లు పూర్తయింది. సలార్ 2 నా బెస్ట్ వర్క్‌లో ఒకటిగా నిలుస్తుందని ఓ ఇంటర్వ్యూలో ప్రశాంత్ నీల్ చెప్పడంతో.. పార్ట్ 2పై అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. నేటికి అన్‌స్టాపబుల్‌గా మూవీ లవర్స్‌లో సలార్ స్పిరిట్ కొనసాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సలార్ 2 (శౌర్యాంగపర్వం) వార్ త్వరలోనే మొదలు కానుందని వార్తలు వస్తుండగా.. సలార్ 2 సీక్వెల్ అప్‌డేట్ కోసం వెయిటింగ్ ఇక్కడ.. క్లారిటీ ఇవ్వండి అంటూ మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు నెట్టింట కామెంట్స్ పెడుతున్నారు. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందనే దానిపై మాత్రం మేకర్స్ ఇప్పటిదాకా ఏం హింట్ ఇవ్వకుండాసైలెన్స్‌ను మెయింటైన్ చేస్తూ వస్తున్నారు. మరి సలార్ రెండేళ్లు పూర్తయిన సందర్భంగానైనా సీక్వెల్‌పై ఏదైనా ప్రకటన చేస్తారేమో చూడాలి. సలార్ హిందీ వెర్షన్ టెలివిజన్ ప్రీమియర్- 2024 జాబితాలో 30 మిలియన్లకుపైగా వ్యూయర్స్‌తో టాప్ 3 స్థానంలో నిలిచింది. మరోవైపు డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో గత ఎనిమిది నెలల నుంచి టాప్ 10లో ట్రెండింగ్‌లో నిలిచింది. సలార్ మరోవైపు 2024 జులై 5న జపనీస్ భాషలో విడుదలైంది. సలార్ జపనీస్ వెర్షన్ ఎబశ్రీబ జీుజ్ఖుఅ లో స్ట్రీమింగ్ అవుతోంది. సలార్‌లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగాడ జగపతి బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ , బాబీ సింహా, ఈశ్వరీ రావు, శ్రియారెడ్డి, జాన్ విజయ్, సప్తగిరి, సిమ్రత్ కౌర్, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రల్లో పోషించారు. హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ తెరకెక్కించారు.




## అప్పుడే అజయ్‌దేవ్‌గన్ దృశ్యం 3 హిందీ రిలీజ్ డేట్ లాక్

మాలీవుడ్‌లో తెరకెక్కి పలు భాషల్లో విడుదలై టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన ప్రాంచైజీ దృశ్యం మలయాళంలో క్రైం థ్రిల్లర్ జోనర్‌లో వచ్చిన ఈ మూవీకి జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించాడు. ఈ ప్రాంచైజీలో దృశ్యం 3 కూడా వస్తోన్న విషయం తెలిసిందే. మోహన్ లాల్ మీనా లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న దృశ్యం 3 షూటింగ్ కూడా పూర్తి చేసుకుంది. కాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ రాకముందే.. దృశ్యం 3 హిందీ వెర్షన్‌పై అదిరిపోయే అప్‌డేట్ అందించారు మేకర్స్. అజయ్ దేవ్‌గన్, శ్రియా శరణ్ కాంబోలో వస్తోన్న మూడో పార్టు రిలీజ్ డేట్‌ను ఎవరూ ఊహించని విధంగా లాక్ చేశారు మేకర్స్. దృశ్యం 3ను 2026 అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం హిందీ వెర్షన్ షూటింగ్ కొనసాగుతుంది. ఈ మూవీలో టబు, రజత్ కపూర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అభిషేక్ పాఠక్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని స్టార్ స్టూడియోస్ సమర్పణలో పనోరమ స్టూడియోస్ సమర్పిస్తోంది. కాగా దృశ్యం 3 ఒరిజినల్ వెర్షన్ థియాట్రికల్, డిజిటల్ రైట్స్ కలిపి ఏకంగా రూ.350 కోట్లు పలికాయని మాలీవుడ్ సర్కిల్‌లో ఓ వార్త ఇప్పటికే హల్ చల్ చేస్తోంది. జార్జ్‌కుట్టీ (మోహన్ లాల్ పాత్ర) ఫ్యామిలీ చుట్టూ తిరిగే కథతో తెరకెక్కిన దశ్యం ప్రాంచైజీలో వచ్చిన రెండు పార్టులు ఇప్పటికే బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని తెరకెక్కిస్తోంది.






# 'కాంచన 4'లో కొత్త అందం.. చాన్స్ ఇచ్చిన రాఘవ లారెన్స్

సౌతిండియా నుంచి వచ్చి దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటున్న నటి మీరా రాజ్. ఆమె తాజాగా నటించిన చిత్రం 'సన్ ఆఫ్' ఇప్పటికే మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు భారీ రెస్పాన్ వస్తోంది. ఈ మూవీలో మీరా చేసిన తన పాత్రకు.. ఆమె స్వయంగా తెలుగులో డబ్బింగ్ చెప్పింది. ఉత్తర భారతీయురాలైనా, స్వచ్ఛమైన తెలుగు ఉచ్చారణతో డైలాగులు చెప్పి ఫ్యాన్స్‌ను ఆశ్చర్యపరిచింది. తాజాగా ఈ బ్యూటీ మరో క్రేజీ ఆఫర్ కొట్టేసింది. పాన్ ఇండియా చిత్రం కాంచన 4లో కీలక పాత్రలో నటించబోతోంది. ఈ మూవీలో పూజా హెగ్డే, రాఘవ లారెన్స్, నోరా ఫతేహి లాంటి స్టార్ నటీనటులతో కలిసి నటించడం మీరా రాజ్‌కు బిగ్ ఛాన్స్‌గా చెప్పుకోవచ్చు. ఈ మూవీ డైరెక్టర్ రాఘవ లారెన్స్‌పై మీరా రాజ్‌కు అపారమైన గౌరవం ఉంది."నా మీద నమ్మకం ఉంచి ఈ పాత్ర ఇచ్చినందుకు లారెన్స్ గారికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఆయన నుంచి నాకు ఎప్పుడూ పూర్తి సపోర్ట్ లభిస్తోంది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి నా శక్తినంతా పెట్టి పనిచేస్తున్నాను" అని మీరా భావోద్వేగంగా చెప్పింది. ఇంకో విశేషం ఏమిటంటే.. ఈ చిత్రంలో తన పాత్రను మరింత సహజంగా మలచుకోవడానికి మీరా ప్రస్తుతం తమిళ భాషను కూడా నేర్చుకుంటోంది. పాత్ర కోసం కొత్త భాషను నేర్చుకోవడమే కాకుండా, సంస్కృతి, మేనరిజమ్స్‌ను అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం ఆమె ప్రొఫెషనలిజానికి నిదర్శనం. ఇప్పుడున్న స్పీడ్ చూస్తుంటే రాబోయే రోజుల్లో సౌత్ స్క్రీన్‌పై మీరా రాజ్ స్టార్ హీరోయిన్‌గా ఎదగడం ఖాయంగా కనిపిస్తోంది.



# రిలీజ్‌కు ముందే ఛాంపియన్ రికార్డ్.. భారీ ధరకు ఓటీటీ డీల్.!

శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా వస్తోన్న పీరియాడికల్ యాక్షన్ చిత్రం ఛాంపియన్. బ్రిటీష్ కాలంలో జరిగిన బైరాన్‌పల్లి గ్రామంలో జరిగిన ఘటన నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. ఇటీవలే ట్రైలర్ రిలీజ్ చేయగా ఆడియన్స్‌లో అంచనాలు పెంచేసింది. ఈ మూవీ ట్రైలర్‌ను గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ట్రైలర్ రిలీజ్ తర్వాత ఈ మూవీపై బజ్ మరింత పెరిగింది. రిలీజ్‌కు ముందే ఈ సినిమా ఓటీటీ రైట్స్ భారీ ధరకు అమ్ముడైనట్లు తెలుస్తోంది. దాదాపు రూ.45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించారు. ఈ సినిమా ఓటీటీ హక్కులు దాదాపు రూ.16 కోట్లకు డీల్ కుదిరినట్లు తెలుస్తోంది. పెద్ద స్టార్స్ లేకపోయినా ఈ రేంజ్‌లో డీల్ సెట్ చేశారంటే మూమూలు విషయం కాదు. ఇప్పటికే రోషన్ మరో సినిమాకు రెడీ అయిపోయినట్లు టాక్ వినిపిస్తోంది. కాగా.. ఈ చిత్రంలో మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రానికి ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. ఈ మూవీని వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ బ్యానర్లపై నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108